

నేటి దర్శిని తెలుగు దిన పత్రిక లో
ప్రకటనల కోసం సంప్రదించగలరు.
సెల్ : 94920 33365

WWW.NETIDARSHINI.COM

# నేటి దర్శిని

RNI NO: TGTEL/25/A0471


తెలుగు దిన పత్రిక

సత్య శోధనే మా లక్ష్యం...

రంగారెడ్డి ఆదివారం 13-09-2026 సంపుటి: 02 సంచిక : 134 వెల: 2 రూ పేజీలు :08 సంపాదకులు: కట్ట హిమ పావని

Ranga Reddy Sunday, 13-09-2026 Volume :02 Issue: 134 RS: 2 Pages:08 Editor : Katta HimaPavani

రిపోర్టర్లు కావలెను



జర్నలిజంలో ఆసక్తి ఉన్నవారికి నేటి దర్శిని ఆహ్వానం పలుకుతుంది. తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిల్లో రిపోర్టర్లుగా పని చేయుటకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లకు కాల్ చేసి సంప్రదించగలరు.

Contact Number
9059328777



## బ్లూ సిటీ, గ్రీన్ సిటీగా హైదరాబాద్

- హైదరాబాద్ వైభవాన్నికాపాడుతాం
- సమర్థంగా పాలన కోసం క్యూర్ చట్టం
- మంత్రి శ్రీధర్ బాబు కీలక వ్యాక్యలు
- శాసనసభలో క్యూర్-2026 బిల్లు..

హైదరాబాద్,
కోర్ అర్బన్ రీజియన్ ఇంటిగ్రేటెడ్ గవర్నెన్స్ బిల్లు-2026ను మంత్రి శ్రీధర్‌బాబు శాసన సభలో ప్రవేశపెట్టారు. హైదరాబాద్‌ను బ్లూ సిటీ, గ్రీన్ సిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా బిల్లు తెచ్చినట్లు ఆయన స్పష్టం చేశారు. రాబోయే 30 ఏళ్ల అవసరాల దృష్ట్యా క్యూర్ చట్టంలో మార్పులకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి నగరాలతో పోటీపడే విధంగా చేయాలనే ఉద్దేశంతో మూసీ పునరుజ్జీవం చేపట్టామని తెలిపారు. బెంగుళూరు, ముంబై, ఢిల్లీ మాదిరిగా హైదరాబాద్ మహా నగరపాలిక సంస్థ చట్టంలో సెక్షన్లు తగ్గించే ప్రణాళిక చేస్తున్నామని వివరించారు. హైదరాబాద్ విస్తరణ పెద్ద ఎత్తున జరుగుతోందని, రాబోయే 30 ఏళ్ల అవసరాల దృష్ట్యా మరింత సమర్థంగా పాలన కోసం క్యూర్ చట్టం

-మిగతా 2 లో

# గణేశ్ ఉత్సవాలపై పటిష్ట నిఘా

**ఉత్సవాలు ముగిసే వరకు నిరంతర పర్యవేక్షణ**


- పోలీస్, మున్సిపల్ శాఖలు సమన్వయంతో పనిచేయాలి
- పర్యవేక్షణకు ప్రత్యేక అధికారుల నియామకం
- కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్
- శాంతిభద్రతలకు విఘాతం లేకుండా చర్యలు
- మండపాల వివరాలను పోలీసులకు ముందుగానే ఇవ్వాలి
- నిమజ్జనానికి చెరువుల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు
- క్రేన్ల ఏర్పాటుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలి
- నిర్వాహకుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సిద్ధం
- గణేశ్ ఉత్సవాలపై రేవంత్ రెడ్డి సమీక్ష

దేశంలో ఎక్కడా లేని విధంగా ఉచిత విద్యుత్



హైదరాబాద్
హైదరాబాద్ మహానగరంలో గణేశ్ ఉత్సవాలు ముగిసే వరకు మున్సిపల్, పోలీసు శాఖలు సమన్వయంతో నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఉత్సవాల పర్యవేక్షణ, సమన్వయం కోసం ప్రత్యేక అధికారులను నియమించాలని సూచించారు. శాసనసభ ఆవరణలోని మండలి సమావేశ మందిరంలో హైదరాబాద్ మహానగరంలో గణేశ్ ఉత్సవాల ఏర్పాట్లపై ముఖ్యమంత్రి ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవాల నిర్వహణ, భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, నిమజ్జన ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. గణేశ్ ఉత్సవాల పర్యవేక్షణ కోసం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్

-మిగతా 2 లో



## భారత్, చైనా కలిసి నడవాలి

- పరస్పరం సహకరించుకోవాలి
- చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ వెల్లడి
- నిర్మాణాత్మక చర్చలకు మేం సిద్ధం
- ప్రధాని నరేంద్ర మోదీ కీలక వ్యాఖ్యలు
- భారత ప్రధాని మోదీ ద్వైపాక్షిక భేటీ
- సరిహద్దు వివాదంపై ఇరువురు చర్చ
- ఏడేళ్ల తర్వాత జిన్‌పింగ్ పర్యటన




## జొమాటోలో మరో కొత్త ఛార్జీ!

- క్యాష్ ఆన్ డెలివరీపై అదనంగా రూ.5 వసూలు
- బిల్ సమ్మరీలో ప్రత్యేకంగా కనిపిస్తున్న చార్జీ
- ఆన్‌లైన్ పేమెంట్లకు మాత్రం అదనపు ఫీజు లేదు
- డిజిటల్ చెల్లింపుల వైపు కస్టమర్లను మళ్లించే యత్నం
- లాభాల పెంపే లక్ష్యంగా కొత్త ఛార్జీల విధానం
- ఇటీవలే ప్లాట్‌ఫామ్ ఫీజు రూ.12.50 నుంచి రూ.14.90కి పెంపు
- ఫుడ్ డెలివరీ రంగంలో పెరిగిన పోటీ ప్రభావం



# ఘనంగా ప్రారంభమైన బ్రిక్స్ సమావేశాలు

- బ్రిక్స్ దేశాలు ఏకగ్రీవంగా ఆమోదం
- డిక్లరేషన్‌ను ప్రకటించిన ప్రధాని మోదీ
- పహల్గామ్ దాడిని ఖండిస్తూ బ్రిక్స్ ప్రకటన
- ప్రధాని నరేంద్ర మోదీ దౌత్య విజయం
- భారత్ ఆకాంక్షలకు రష్యా, చైనా మద్దతు
- పుతిన్, జిన్‌పింగ్ లకు మోదీ ఘన స్వాగతం

02 'దిల్లీ డిక్లరేషన్' కు ఆమోదముద్ర

న్యూఢిల్లీలో భారత్ ఆతిథ్యమిస్తున్న 18వ బ్రిక్స్ సదస్సు ప్రపంచ వేదికపై భారత్ ప్రాధాన్యాన్ని మరోసారి చాటింది. శాంతి, భద్రత, ఆర్థిక సహకారం, అంతర్జాతీయ వాణిజ్యం, అభివృద్ధి వంటి కీలక అంశాలపై సభ్య దేశాలు విస్తృతంగా చర్చించి న్యూఢిల్లీ డిక్లరేషన్‌ను ఏకగ్రీవంగా ఆమోదించాయి. అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వడం, ప్రపంచ ఆర్థిక సంస్థల్లో సంస్కరణలు చేపట్టడం, సభ్య దేశాల మధ్య వాణిజ్యం--పెట్టుబడులు--సాంకేతిక సహకారాన్ని విస్తరించడంపై నిర్ణయాలు తీసుకున్నాయి. ప్రపంచ ఘర్షణలకు శాంతియుత పరిష్కారాలు, బహుపాక్షిక సహకారం, పరస్పర గౌరవం అవసరమని స్పష్టం చేస్తూ ప్రధాని నరేంద్ర మోదీ బ్రిక్స్ దేశాలు ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

# మాక్ అసెంబ్లీలో బీఆర్ఎస్ సెటైర్లు


- ఎమ్మెల్యేల సస్పెన్షన్‌కు నిరసనగా మాక్ అసెంబ్లీ
- తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ నేతల వినూత్న నిరసన
- స్పీకర్‌గా మాణిక్‌రావు.. సీఎం పాత్రలో తలసాని
- రేవంత్‌రెడ్డిని అనుకరిస్తూ తలసాని వ్యాఖ్యలు
- 100 రోజుల హామీలపై కాంగ్రెస్‌కు చురకలు
- కొండా సురేఖ వ్యవహారంపైనా వ్యంగ్యాస్త్రాలు
- పోలీసుల తీరుపై బీఆర్ఎస్ నేతల మండిపాటు
- కేటీఆర్‌తో సహా 22 మంది ఎమ్మెల్యేల సస్పెన్షన్
- ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీసిన బీఆర్ఎస్

**రేవంత్ సర్కార్‌పై బీఆర్ఎస్ వ్యంగ్యాస్త్రాలు**

హైదరాబాద్,
కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని బీఆర్ఎస్ పార్టీ విమర్శనాస్త్రాలు సంధించింది. తమ ఎమ్మెల్యేలను అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో 'మాక్ అసెంబ్లీ' నిర్వహించారు. ఈ వేదిక ద్వారా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై, ప్రభుత్వ హామీల అమలుపై బీఆర్ఎస్ నేతలు తీవ్రస్థాయిలో వ్యంగ్యాస్త్రాలు విసిరారు. ఈ మాక్ అసెంబ్లీలో జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు స్పీకర్‌గా వ్యవహరించగా, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ముఖ్యమంత్రి పాత్రను పోషించి రేవంత్ రెడ్డిని అనుకరిస్తూ మాట్లాడారు.

-మిగతా 2 లో






## సౌదీ పైప్‌లైన్‌పై ఇరాక్ డ్రోన్ దాడి

- 1,200 కి.మీ. కీలక పైప్‌లైన్ తాత్కాలికంగా మూసివేత
- దాడిలో పలువురికి గాయాలు.. భారీగా ఆస్తినష్టం
- ఇరాక్ నుంచి దాడి జరిగినట్లు ధ్రువీకరణ
- సైనిక కమాండర్‌పై వేటు.. ప్రధాని విచారణకు ఆదేశం
- భద్రతా కారణాలతో సరిహద్దు క్రాసింగులు మూసివేత
- ఇరాన్ మద్దతు మిలీషియాలపై సౌదీ తీవ్ర ఆరోపణలు
- హోర్ముజ్ సంక్షోభంతో పైప్‌లైన్‌కు పెరిగిన ప్రాధాన్యం
- తూర్పు--పడమర పైప్‌లైన్ ద్వారా చమురు తరలింపు
- ప్రతీకార దాడులకు దిగబోమన్న సౌదీ అరేబియా
- సార్వభౌమత్వం,భద్రత రక్షణకు చర్యలు తప్పవని స్పష్టీకరణ




## కాంగ్రెస్ పదవులకు రావత్ రాజీనామా

- ఈడీ సోదాల వేళ రావత్ సంచలన నిర్ణయం
- పార్టీకి ఇబ్బంది రాకూడదంటూ రాజీనామా
- పీఏ చందన్ సింగ్ నివాసాల్లో ఈడీ తనిఖీలు
- రూ.32 లక్షల నగదు.. 200 గ్రాముల బంగారం గుర్తింపు



## 22 ఏ మేం తెచ్చింది కాదు

- కొత్తగా భూముల్ని నిషేధిత జాబితాలో చేర్చలేదు
- బీఆర్ఎస్ హయాంలో ఆ క్లాజు దుర్వినియోగం
- అప్పుడు విస్మరించి.. ఇప్పుడు ప్రజల్ని రెచ్చగొడుతున్నారు
- దర్యాప్తు కోసం చారుసిన్హా చైర్మెన్‌గా 'సిట్' వేశాం
- ఫోరెన్సిక్ ఆడిట్‌తో భూ అక్రమాల బాగోతం బట్టబయలు
- '22ఏ'పై స్వల్పకాలిక చర్చలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్
భూముల్ని నిషేధిత జాబితాలో చేరుస్తూ 22A ను తమ ప్రభుత్వం తీసుకురాలేదని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆ కాలమ్ 1999 నుంచే ఉందనీ, బీఆర్ఎస్ తెచ్చిన ధరణి చట్టం ద్వారా 22ఏ ను దుర్వినియోగం చేశారని చెప్పారు. తొమ్మిదున్నరేండ్లు అధికారంలో ఉన్నప్పుడు పేదలకు న్యాయం చేయాలని ఆనాటి మంత్రి హరీశ్‌రావుకు ఎందుకు గుర్తుకు రాలేదని ప్రశ్నించారు. అప్పుడు విస్మరించి ఇప్పడే కాంగ్రెస్ ప్రభుత్వం 22ఏను తీసుకొచ్చినట్టు ప్రజల్ని రెచ్చగొడుతున్నారని విమర్శించారు. 22ఏ పై శాసనసభలో శనివారం స్వల్పకాలిక చర్చ జరిగింది. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సుదీర్ఘంగా మాట్లాడారు. సిద్దిపేట, సిరిసిల్ల జిల్లాల్లో తొలుత, ఆ తర్వాత

-మిగతా 2 లో

# బ్లూ సిటీ, గ్రీన్ సిటీగా హైదరాబాద్

మొదటి తరువాయి

తీసుకువచ్చినట్లు మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. హైదరాబాద్ గత వైభవాన్ని కాపాడుకుంటూ భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా సిద్ధం చేయాలని అన్నారు. తెలంగాణ రైజింగ్-2047 పాలసీ రూపొందించుకుని ముందుకెళ్తున్నామని వివరించారు. 2034 నాటికి ట్రిలియన్, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ రాష్ట్రాన్ని తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకుని ముందుకు వెళుతున్నట్లు మంత్రి శ్రీధర్? బాబు తెలిపారు. లక్ష్య సాధనకు హైదరాబాద్ మరింత అధునాతనంగా అంతర్జాతీయ స్థాయికి చేరాలని అన్నారు. ప్రపంచ నగరాలతో పోటీపడే స్థాయికి హైదరాబాద్ ఎదగాలన్నారు. పెద్దఎత్తున పెట్టుబడులు ఆకర్షించే స్థాయికి మనం ఎదగాలని పేర్కొన్నారు. క్యూర్, ప్యూర్, రేర్ నినాదంతో రాష్ట్ర అభివృద్ధికి చర్యలున్నాయని గుర్తు చేశారు.క్యూర్' తెలంగాణ ఆర్థిక ప్రగతికి అత్యంత కీలక ప్రాంతమని, రాష్ట్ర విస్తీర్ణంలో చిన్నదైనా తెలంగాణ ఆర్థిక వ్యవస్థలో క్యూర్ పాత్ర పెద్దదని శ్రీధర్ బాబు వివరించారు. 2025-26లో తెలంగాణ జీఎస్డీపీ రూ.17.82 లక్షల కోట్లకు చేరిందని, క్యూర్ పరిధిలో 10.7 శాతం వృద్ధి నమోదైనట్లు తెలిపారు. ఆర్థిక వ్యవస్థ సేవా రంగానికి సంబంధించి 68.6 శాతం వృద్ధి నమోదైందని అన్నారు. సేవా రంగం, పెట్టుబడులు, ఉపాధికి ప్రధాన కేంద్రంగా హైదరాబాద్ ఉందని అన్నారు. క్యూర్ పరిధి హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలు ఆర్థిక ఉత్పత్తిలో తొలి 3 స్థానాల్లో ఉన్నాయన్నారు. క్యూర్ ప్రాంతంలో పరిపాలన వ్యవస్థను భవిష్యత్ అవసరాల మేరకు పునర్నిర్మించాలన్నారు. హైదరాబాద్?లో రవాణా కోసం కాంప్రిహెన్సివ్ మొబిలిటీ ప్లాన్ చేశామని శ్రీధర్? బాబు తెలిపారు. రాబోయే 30 ఏళ్ల అవసరాల దృష్ట్యా క్యూర్ చట్టం పని చేస్తుందని అన్నారు. మూసీ పునరుజ్జీవం తొలి దశకు రూ.7,345.12 కోట్లతో అనుమతులు తీసుకున్నట్లు వివరించారు. 20 టీఎంసీల గోదావరి జలాలు తీసుకువచ్చేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. జీహెచ్ఎంసీని ట్రై కార్పొరేషన్లుగా విభజించుకున్నామని, అన్ని సంస్థలు సమన్వయంతో పని చేసేలా చట్టబద్ధ వ్యవస్థగా ఏర్పాటు చేస్తున్నామన్నారు. సీఎం అధ్యక్షతన క్యూర్ అత్యున్నత పాలక మండలి ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మహానగరపాలిక చట్టంలో సెక్షన్లు తగ్గించే ప్రణాళిక చేస్తున్నామన్నారు. మురుగునీటిని శుద్ధి చేసి పునర్వినియోగం చేసే దిశగా యోచన చేస్తున్నట్లు చెప్పారు. చెట్ల పెంపకం, కాలుష్య నివారణకు వాడాలనే ప్రభుత్వ ఆలోచనలు ఉన్నాయని, హైదరాబాద్‌ను బ్లూ సిటీ, గ్రీన్ సిటీగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.

# జొమాటోలో మరో కొత్త ఛార్జీ!

## ఆన్ డెలివరీలపై రూ 5 అదనపు చార్జీలు




న్యూఢిల్లీ
: ప్రముఖ ఫుడ్ డెలివరీ యాప్ జొమాటో వినియోగదారులకు మరో షాక్ ఇచ్చింది. ఒక్కో క్యాష్ ఆన్ డెలివరీపై రూ.5 అదనపు చార్జీల వసూలు ప్రారంభించింది. జొమాటో బిల్ సమ్మరీలో ఈ చార్జీలు కనిపిస్తున్నాయి. అయితే ఆన్‌లైన్ పేమెంట్లు చేసే వారికి ఈ ఛార్జీలు వర్తించవని సంస్థ చెబుతున్నది.లాభాలను పెంచుకోవడం, కస్టమర్లను డిజిటల్ పేమెంట్ల వైపు ప్రోత్సహించడంలో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్టు సంస్థ చెబుతున్నది. ఇటీవల ప్లాట్‌ఫామ్ ఫీజును రూ.12.50 నుంచి రూ.14.90కి పెంచిన సంస్థ ఇప్పుడు మరో ఫీజును విధిస్తున్నది. ఫుడ్ డెలివరీ రంగంలో పోటీ తీవ్రం కావడంతో లాభాలను మెరుగుపరుచుకునేందుకే జొమాటో ఇలా చార్జీలను పెంచుతున్నట్టు సమాచారం.

# మాక్ అసెంబ్లీలో బీఆర్ఎస్ సెటైర్లు

మొదటి తరువాయి

ఇటీవల మంత్రివర్గం నుంచి కొండా సురేఖను తొలగించిన అంశాన్ని ప్రస్తావిస్తూ, "కొండా సురేఖ కుమార్తె నా గురించి మాట్లాడినందుకే ఢిల్లీకి వెళ్లి, మూడు రోజులు ఉండి, ఆమెను (సురేఖను) అణచివేసి వచ్చాను. బీసీ బిడ్డనైన నేను సీఎం అయ్యాక, ఆమెను కేబినెట్ నుంచి తీసేయక ఏం చేయగలను?" అని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రకటించిన 100 రోజుల హామీలపైనా తలసాని చురకలంటించారు. "100 రోజుల్లో హామీలు అమలు చేస్తామని చెప్పాం కానీ, ఏ 100 రోజుల్లో అని చెప్పామా? ఢిల్లీలో మాకూ కొన్ని ఇబ్బందులు ఉంటాయి కదా" అంటూ ఎద్దేవా చేశారు. తమ పార్టీ మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసుల ప్రవర్తన, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆరోగ్యంపై కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేసిన వ్యాఖ్యలపై చర్చకు పట్టుబట్టినందుకు గాను, సెప్టెంబర్ 9న కేటీఆర్ తో సహా 22 మంది ఎమ్మెల్యేలను స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సస్పెండ్ చేశారు. ఈ సస్పెన్షన్‌కు నిరసనగానే బీఆర్ఎస్ ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. కేటీఆర్‌తో పాటు ఇతర ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్న ఈ వేదికపై, ప్రభుత్వం చర్చకు అనుమతించని ప్రజా సమస్యలను ప్రస్తావిస్తూ ప్లకార్డులు ప్రదర్శించి నిరసన తెలిపారు.

# కాంగ్రెస్ పదవులకు రావత్ రాజీనామా



డెహ్రాడూన్ : ఉత్తరాఖండ్ మాజీ సీఎం హరీశ్ రావత్ కాంగ్రెస్‌లోని అన్ని పదవులకు రాజీనామా చేశారు. తన పీఏ చందన్ సింగ్ జీనా నివాసాల్లో శుక్రవారం ఈడీ దాడులు జరగ్గా.. శనివారం ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. 2016లో హరీశ్ రావత్ సీఎంగా ఉన్నప్పుడు చందన్ సింగ్ ఆయనకు ఓఎస్డీగా పనిచేశారు. ఆ ఏడాదిలో నియామక పరీక్షల్లో జరిగిన అక్రమాల్లో మనీ లాండరింగ్ కేసు దర్యాప్తులో భాగంగా చందన్ సింగ్ ఇల్లుతో పాటు పలు చోట్ల ఈడీ సోదాలు జరిగాయి. ఈ దాడుల్లో రూ.32 లక్షల లెక్కలు చూపని నగదు, 200 గ్రాముల బంగారం, లగ్జరీ వాచ్‌లు అధికారులు గుర్తించారు. చందన్ సింగ్ కుటుంబీకుల బ్యాంకు ఖాతాల్లో రూ.50 లక్షల దాకా నగదును సీజ్ చేశారు. ఈ దాడుల నేపథ్యంలో హరీశ్ రావత్ మాట్లాడుతూ.. తన వల్ల కాంగ్రెస్‌కు ఇబ్బంది రావొద్దనే పదవులకు రాజీనామా చేశానన్నారు. నియామక పరీక్షల్లో ఆరోపణలు నిజమని తేలితే తనకు కూడా సిగ్గుచేటేనని పేర్కొన్నారు.

# 22 ఏ మేం తెచ్చింది కాదు

మొదటి తరువాయి

రాష్ట్రమంతటా భూములపై ఫోరెన్సిక్ ఆడిట్‌ను చేయించామని తెలిపారు. అందులో వేలాది ఎకరాల భూమి 13 వేల ఖాతాలకు ట్రాన్స్‌ఫర్ అయిందని తేలిందన్నారు. దీనిపై చారుసిన్హా చైర్మెన్‌గా సిట్ వేశామని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో రిజిస్ట్రేషన్ల ఆదాయాన్ని కూడా కొల్లగొడితే.. రూ.కోటీ 89 లక్షలను తమ ప్రభుత్వం రికవరీ చేసిందని గుర్తుచేశారు. ఈ సందర్భంగా ప్రతిపక్ష నాయకులు హరీశ్‌రావు, ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ఎంపీ రఘునందన్ రావు చేసిన వ్యాఖ్యల వీడియో క్లిప్పింగ్స్‌ను స్పీకర్ అనుమతితో సభలో చూపించారు. తద్వారా 22-ఏ లో పెట్టి రిజిస్ట్రేషన్లు నిలిపిశారని చేసిన ప్రచారాన్ని తిప్పికొట్టారు. గతేడాదికి ఈ ఏడాదికి ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు 1,359 కోట్ల రూపాయల ఆదాయం పెరిగిందని చెబుతూ రిజిస్ట్రేషన్ల వివరాలను సభ ముందుంచారు. ధరణి వచ్చిన తరువాత తయారు చేసిన 22-ఏ జాబితానే హైకోర్ట్ ఆదేశాల మేరకు డిసెంబర్ 3, 2025న ఆన్ లైన్ లో అప్ లోడ్ చేసే సమయంలో పొరపాటు జరిగిందని అంగీకరించారు. తప్పును గుర్తించి వెంటనే దాన్ని సరిదిద్దామని చెప్పారు. 22-ఏ సమస్యను తొమ్మిదన్నరేండ్లు అధికారంలో ఉన్నవాళ్ళు పరిష్కరించి ఉంటే ఈ రోజు ఈ సమస్య వచ్చి ఉండేది కాదన్నారు.

ఇవీ వాస్తవాలు

2023 డిసెంబర్ 7కు ముందు బీఆర్ఎస్ హయాంలో 22ఎ లో 96,61,026 ఎకరాలు, వ్యవసాయేతర భూములు 1,95,812 ఎకరాలు, ప్రయివేటు భూములు 3,95,852 ఎకరాలు...మొత్తంగా 1 కోటి 02 లక్షల 52 వేల 690 ఎకరాలు ఉన్నాయని తెలిపారు. అలాగే 2023 డిసెంబర్ 7 నుంచి ఆగస్టు 31వ తేదీ నాటికి ఇదే 22ఎలో ప్రభుత్వ భూములు 96,36,777 ఎకరాలు, వ్యవసాయయేతర భూములు 1,94,543 ఎకరాలు, ప్రయివేటు భూములు 3,73,930 ఎకరాలు...మొత్తంగా 1 కోటి 02 లక్షల 05 వేల 250 ఎకరాలు ఉన్నాయని వివరణ ఇచ్చారు. గతంలో కంటే 22ఎ లో చేర్చిన భూములు 47,440 ఎకరాలు తగ్గాయని చెప్పారు. గతంలో పట్టాల్యాండ్ క్లాసిఫికేషన్ (భూమి స్వరూపం తప్పుగా నమోదు చేయడం వల్ల) టీఎమ్15 మాడ్యూల్ ద్వారా తొలగించిన 23 వేల ఎకరాల భూమి, గతంలో ఇచ్చిన జీవోలు, మెమోలు రెగ్యులైజేషన్ ఉత్తర్వుల ప్రకారం తొలగించిన భూమిని కూడా కలిపితే 47,440 ఎకరాలు తగ్గిందని వివరించారు.

# ఘనంగా ప్రారంభమైన బ్రిక్స్ సమావేశాలు

- -దిల్లీ డిక్లరేషన్' కు ఆమోదముద్ర
- -బ్రిక్స్ దేశాలు ఏకగ్రీవంగా ఆమోదం
- -డిక్లరేషన్‌ను ప్రకటించిన ప్రధాని మోదీ
- -పహల్గామ్ దాడిని ఖండిస్తూ బ్రిక్స్ ప్రకటన
- -ప్రధాని నరేంద్ర మోదీ దౌత్య విజయం
- -భారత్ ఆకాంక్షలకు రష్యా, చైనా మద్దతు
- -పుతిన్, జిన్‌పింగ్ లకు మోదీ ఘన స్వాగతం




భారత రాజధాని న్యూఢిల్లీలోని ప్రతిష్టాత్మక భారత్ మండపం వేదికగా 18వ బ్రిక్స్ సదస్సు అట్టహాసంగా ప్రారంభమైంది. సమావేశంలో న్యూ దిల్లీ డిక్లరేషన్ 2026 కు బ్రిక్స్ కూటమిలోని సభ్య దేశాలు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపాయి. బ్రిక్స్ సమావేశానికి ఆతిథ్యం ఇచ్చిన భారత్ కు ఇది అతిపెద్ద దౌత్య విజయం అని చెప్పొచ్చు. భారత్ న్యూ దిల్లీ డిక్లరేషన్ కు కూటమిలోని ఏ దేశం కూడా అభ్యంతరం చెప్పకపోవడం విశేషం. ఇది ఏకగ్రీవంగా ఆమోదం పొందిందని ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడించారు. భౌగోళిక రాజకీయ అంశాలపై సభ్య దేశాల మధ్య భేదాభిప్రాయాలు ఉన్నప్పటికీ న్యూ దిల్లీ డిక్లరేషన్ కు ఏకాభిప్రాయం లభించడం భారత్ కు అతిపెద్ద దౌత్య విజయంగా నిలుస్తుందని అన్నారు. అంతర్జాతీయ విధానాలు, ఆర్థిక సహకారం, శాంతిభద్రతలపై సభ్య దేశాల ఉమ్మడి నిబద్ధతను ఈ నిర్ణయం చాటిచెబుతోందని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో సంస్కరణలను ఇక ఏమాత్రం ఆలస్యం చేయకూడదని మోదీ స్పష్టం చేశారు. బ్రిక్స్ దేశాలు ఒకరి అభిప్రాయాలను మరొకరు గౌరవించుకుంటూ ఏకాభిప్రాయంతో ముందుకు సాగాలని సూచించారు. మనం ఎవరికీ వ్యతిరేకం కాదు, అందరినీ కలుపుకుని ముందుకు వెళ్లేందుకే ప్రయత్నిస్తామని ప్రధాని తన ప్రసంగంలో నొక్కిచెప్పారు. అధికారాలు, విశేషాధికారాలు ఉన్న అగ్ర దేశాల వ్యవస్థను రాబోయే 20 ఏళ్లలో ఒక భాగస్వామ్య వేదికగా మార్చాల్సిన అవసరం ఉందన్నారు. బ్రిక్స్ సభ్య దేశాల కోసం ఒక సురక్షితమైన డిజిటల్ రిపోజిటరీ (డేటాబేస్) సృష్టించగలమని మోదీ ధీమా వ్యక్తం చేశారు. గ్లోబల్ సంస్కరణల దిశానిర్దేశం చేయడంలో బ్రిక్స్ కీలక పాత్ర పోషించాలన్నారు. సదస్సులో తీసుకున్న నిర్ణయాలను, అంగీకరించిన అంశాలను క్షేత్రస్థాయిలో అమలు చేయడానికి 'బ్రిక్స్ కంటిన్యూటీ, ఇంప్లిమెంటేషన్ మెకానిజం' ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. కష్టకాలంలో ఉన్న గ్లోబల్ సౌత్ దేశాలకు ఈ కూటమి ఎల్లప్పుడూ అండగా నిలవాలని ఆయన కోరారు. ఇక రెండు రోజుల పాటు జరిగే ఈ 18వ బ్రిక్స్ సమావేశంలో భారత్, రష్యా, చైనా, బ్రెజిల్, ఈజిప్ట్, ఇండోనేషియా, ఇథియోపియా, ఇరాన్, సౌదీ అరేబియా సహా మొత్తం 21 దేశాలు పాల్గొన్నాయి. అయితే విభేధాలు పక్కన పెట్టి మరీ ఇరాన్, యూఏఈ, సౌదీ అరేబియా దేశాలు న్యూ దిల్లీ డిక్లరేషన్ కు ఆమోదం తెలపడం కీలకంగా మారింది. న్యూ దిల్లీ డిక్లరేషన్ లోని కీలక విషయాలు చూస్తే.. ప్రపంచ వాణిజ్య సంస్థల నిబంధనలకు విరుద్ధంగా, వాణిజ్యాన్ని దెబ్బతీసే విధంగా ఏకపక్ష సుంకాలు పెరగడంపై బ్రిక్స్ దేశాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఇలాంటి ఏకపక్ష చర్యలను బ్రిక్స్ దేశాలు ఖండించాయి. అలాగే ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఉన్న యుద్ధాలు, ఘర్షణలను శాంతి యుతంగా, దౌత్య పరంగా మాత్రమే పరిష్కరించుకోవడానికి తాము కట్టుబడి ఉన్నామని బ్రిక్స్ కూటమి స్పష్టం చేసింది. అలాగే ప్రపంచంలో నెలకున్న సమస్యలపై వివిధ దేశాలు చూసే దృక్కోణాన్ని తాము స్వాగతిస్తున్నట్లు తెలిపాయి. దాంతోపాటు అంతర్జాతీయ సమస్యలపై శాంతి యుత చర్చలు, భాగస్వామ్యాన్ని నొక్కి చెప్పాయి. అలాగే గతేడాది ఏప్రిల్ 22న జమ్మూ కాశ్మీర్ లోని పహల్గామ్ లో జరిగిన ఉగ్రదాడిని బ్రిక్స్ దేశాలు తీవ్రంగా ఖండించాయి. ఇది క్రిమినల్ చర్య అని ఎప్పటికీ క్షమించరానిదాని తెలిపాయి. ఈ ఘోర ఘటనలో 26 మంది ప్రాణాలు కోల్పోగా.. మరెందరో గాయపడినట్లు వివరించాయి. ఇలాంటి ఉగ్రవాద చర్యలను అసలు ఉపేక్షించేది లేదని బ్రిక్స్ కూటమి దేశాలు స్పష్టం చేశాయి. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా ఎదుర్కొనేందుకు తీసుకున్న నిర్ణయాలకు కట్టుబడి ఉన్నామని పునరుద్ఘాటించాయి. వీటితోపాటు మారుతున్న, వర్తమాన ప్రపంచ పరిస్థితులకు అనుగుణంగా ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో తక్షణ సంస్కరణలు చేపట్టాలని బ్రిక్స్ దేశాలు డిమాండ్ చేశాయి. భారత్ నేతృత్వంలో ఈ బ్రిక్స్ సదస్సు ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతుందని తీర్మానించాయి. ఐరాస భద్రతా మండలిలో నిర్మాణాత్మక మార్పులు, ఆఫ్రికా, ఆసియా, లాటిన్ అమెరికా దేశాలకు భద్రతా మండలిలో మెరుగైన ప్రాతినిధ్యం దక్కాలని దిల్లీ డిక్లరేషన్ ఆకాంక్షించింది. ముఖ్యంగా భద్రతా మండలిలో భారత్, బ్రెజిల్ దేశాలకు మరింత పెద్ద పాత్ర దక్కాలన్న డిమాండ్‌కు శాశ్వత సభ్య దేశాలైన చైనా, రష్యాలు తమ మద్దతును పునరుద్ఘాటించాయి. ఐఎంఎఫ్?, ప్రపంచ బ్యాంకుల్లో అభివృద్ధి చెందుతున్న దేశాలకు మరింత ప్రాతినిధ్యం దక్కాలని బ్రిక్స్ కూటమి డిమాండ్ చేసింది.వాణిజ్యపరంగా ఈ సదస్సులో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. బ్రిక్స్ దేశాల మధ్య వాణిజ్యం డాలర్‌కు బదులుగా స్థానిక కరెన్సీలలోనే ఎక్కువగా జరగాలని, సరిహద్దు చెల్లింపుల కోసం ఆచరణాత్మక పరిష్కారాలను సులభతరం చేయాలని డిక్లరేషన్ పేర్కొంది. ప్రపంచ వాణిజ్య సంస్థ నిబంధనలకు విరుద్ధంగా ఏకపక్షంగా విధిస్తున్న సుంకాలు, బలవంతపు చర్యలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. మరోవైపు ఉగ్రవాదంపై జీరో టాలరెన్స్ ప్రదర్శించాలని పిలుపునిచ్చింది. పహల్గాం ఉగ్రదాడిని బ్రిక్స్ డిక్లరేషన్ తీవ్రంగా ఖండించింది. సరిహద్దు ఉగ్రవాదం, ఉగ్ర నిధులు అరికట్టాలని, ఉగ్రవాద నిర్మూలనలో ద్వంద్వ వైఖరి వీడాలని స్పష్టం చేసింది. అలాగే అణు కేంద్రాలపై జరుగుతున్న దాడులను, పెరుగుతున్న అణ్వస్త్ర ప్రమాదాలను ఖండించింది. అభివృద్ధి చెందుతున్న దేశాలకు అందాల్సిన నిధులను పక్కదారి పట్టిస్తూ, గ్లోబల్ మిలిటరీ ఖర్చులు విపరీతంగా పెరిగిపోవడం పట్ల విచారం వ్యక్తం చేసింది. అలాగే అభివృద్ధి చెందుతున్న దేశాలకు శిలాజ ఇంధనాలు ఇంకా అవసరమేనని స్పష్టం చేస్తూనే, పర్యావరణ అనుకూల ఇంధనాల వైపు మారాలని డిక్లరేషన్ సూచించింది. ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి బ్రిక్స్ స్టార్టప్ ఇన్నోవేషన్ ఫండ్ ఏర్పాటుకు బ్రిక్స్ దేశాలు తీర్మానించాయి. ఆర్థిక, సామాజిక వృద్ధిలో నిర్ణయాధికారులుగా మహిళల పాత్ర అత్యంత కీలకమని న్యూదిల్లీ డిక్లరేషన్ గుర్తించింది.

# గణేశ్ ఉత్సవాలపై పటిష్ట నిఘా

మొదటి తరువాయి

ఏర్పాటు చేసుకోవాలని సీఎం సూచించారు. హైదరాబాద్ నగరం ప్రశాంతంగా ఉన్నప్పుడే పెట్టుబడులు వస్తాయని, శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని అన్నారు. గణేశ్ ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలు సాఫీగా సాగేందుకు నిర్వాహకులు ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. ఉత్సవాలకు సంబంధించి ఏవైనా సమస్యలు ఉంటే పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గణేశ్ ఉత్సవాలకు సంబంధించి గత సంప్రదాయాన్ని పునరుద్ధరించామని ముఖ్యమంత్రి తెలిపారు. ఉత్సవ నిర్వాహకులు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా తెలుసుకునేందుకు సమీక్ష నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గణేశ్ మండపాలకు ప్రముఖులు, అతిథులను ఆహ్వానించిన సందర్భాల్లో వారి వివరాలను నిర్వాహకులు స్థానిక పోలీసు కమిషనరేట్‌కు ముందుగానే అందించాలని సూచించారు. ముందస్తు సమాచారం ఉంటే అవసరమైన భద్రతా చర్యలు చేపట్టడంతోపాటు అనుకోని పరిణామాలు చోటుచేసుకున్నప్పుడు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవడానికి వీలుంటుందని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో గణేశ్ మండపాలకు ఉచితంగా విద్యుత్ అందిస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. మండపాల నిర్వాహకులు సంబంధిత అధికారుల వద్ద దరఖాస్తు చేసుకుని ఉచిత విద్యుత్ సౌకర్యాన్ని పొందాలని సూచించారు. ఎక్కడెక్కడ గణేశ్ మండపాలు ఏర్పాటు చేస్తున్నారనే సమాచారాన్ని ముందుగానే పోలీసులకు అందించాలని కోరారు. దీనివల్ల ట్రాఫిక్ నియంత్రణ, బందోబస్తు ఏర్పాట్లను పోలీసులు ముందుగానే ప్రణాళిక చేసుకునేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. అభివృద్ధి చేస్తున్న చెరువుల వద్ద బతుకమ్మలకు ఏర్పాట్లు చేస్తున్న తరహాలోనే గణేశ్ నిమజ్జనాలకు అనుగుణంగా నిర్మాణ సమయంలోనే అవసరమైన చర్యలు తీసుకోవాలని సీఎం స్పష్టం చేశారు. నిమజ్జన ప్రక్రియ సాఫీగా సాగేందుకు చెరువుల వద్ద చుట్టూ క్రేన్లు ఏర్పాటు చేసుకునే విధంగా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, మహమ్మద్ అజారుద్దీన్, ఎంపీ వేం నరేందర్‌రెడ్డి, నగర ప్రజాప్రతినిధులు, జీహెచ్ఎంసీ, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్, హైడ్రా కమిషనర్లు, పోలీసు ఉన్నతాధికారులు, గణేశ్ ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# భారత్, చైనా కలిసి నడవాలి

- -పరస్పరం సహకరించుకోవాలి
- -చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ వెల్లడి
- -నిర్మాణాత్మక చర్చలకు మేం సిద్ధం
- -ప్రధాని నరేంద్ర మోదీ కీలక వ్యాఖ్యలు
- -భారత ప్రధాని మోదీ ద్వైపాక్షిక భేటీ
- -సరిహద్దు వివాదంపై ఇరువురు చర్చ
- -ఏడేళ్ల తర్వాత జిన్‌పింగ్ పర్యటన



బ్రిక్స్ సదస్సులో పాల్గొనేందుకు దిల్లీకి వచ్చిన చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో భారత మండపంలో ప్రధాని నరేంద్ర మోదీ భేటీ అయ్యారు. ఈ క్రమంలో సరిహద్దు వివాదం, వాణిజ్యం సహా పలు అంశాలపై ఇరువురు నేతలు ద్వైపాక్షిక చర్చలు జరిపారు. అనంతరం చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్‌తో దీర్ఘకాలిక, వ్యూహాత్మక ఒప్పందాలు చేసుకుంటామని అన్నారు. అతిపెద్ద దేశాలుగా ఉన్న భారత్, చైనా కలిసి నడవాలని, అనేక విషయాల్లో పరస్పరం సహకరించుకోవాలని పిలుపునిచ్చారు. అలాగే, ఆధునిక టెక్నాలజీ సాయంతో వేగంగా పురోగతి సాధించాలని అభిప్రాయపడ్డారు. ద్వైపాక్షిక సంబంధాల దీర్ఘకాలిక అభివృద్ధిని వ్యూహాత్మక కోణంలో ఇరుపక్షాలు దృష్టిలో ఉంచుకోవడంతోనే చైనా-భారత్ సంబంధాలు అభివృద్ధి చెందాయి. చైనా, భారత్‌లు భిన్నమైనవి. అయినప్పటికీ ఉమ్మడి అభివృద్ధిని సాధించడానికి ఇరు దేశాలు పరస్పరం మద్దతు ఇచ్చుకున్నాయి. సహాయం చేసుకున్నాయి. దిల్లీలో జరిగిన బ్రిక్స్ సదస్సుకు హాజరవడం, ప్రధాని మోదీని మరోసారి కలవడం నాకు చాలా ఆనందంగా ఉంది. భారత్‌లో జరిగిన బ్రిక్స్ సదస్సు విజయవంతమైనందుకు మోదీకి నా హృదయపూర్వక అభినందనలు తెలిపారు. గత 12 ఏళ్లలో దిల్లీలో తాను పర్యటించడం ఇది రెండోసారని చైనా అధినేత షీ జిన్‌పింగ్ పేర్కొన్నారు. అదే సమయంలో భారత ప్రధాని మోదీని ఇప్పటివరకు 21 సార్లు కలిశానని గుర్తు చేసుకున్నారు. తత్ఫలితంగా తమ ఇద్దరి మధ్య అనేక ముఖ్యమైన ఏకాభిప్రాయాలు కుదిరాయని స్పష్టం చేశారు. ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన దేశాలుగా, గ్లోబల్ సౌత్‌లో సభ్యులుగా ఇరు దేశాల ఉమ్మడి స్థానాన్ని ఈ సందర్భంగా షీ జిన్‌పింగ్ హైలైట్ చేశారు. మానవాళి ఉమ్మడి భవిష్యత్తు కోసం చైనా, భారత్‌లకు ముఖ్యమైన బాధ్యతలు ఉన్నాయని అభిప్రాయపడ్డారు. చైనా, భారత్‌లు ఒకరి సామర్థ్యాల నుంచి మరొకరు నేర్చుకుంటూ, ఉమ్మడి అభివృద్ధిని సాధించగలవని అన్నారు."భారత్, చైనాలు భిన్నమైన దేశాలు అయినప్పటికీ, ఉమ్మడి అభివృద్ధిని సాధించడానికి పరస్పరం మద్దతు ఇచ్చుకున్నాయి. చైనా, భారత్ ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన దేశాలు. అలాగే గ్లోబల్ సౌత్‌లో కీలకమైనవి. మానవాళికి ఉమ్మడి భవిష్యత్తు కోసం ఈ రెండు దేశాలపై కీలకమైన బాధ్యతలు ఉన్నాయి. నాణ్యమైన సహకారాన్ని ఇరుదేశాలు కొనసాగించాలి. మరింత సమానత్వం, సమ్మిళితత్వం, స్వేచ్ఛాయుతమైన, ఆర్థికంగా ఏకీకృతమైన ప్రపంచం కోసం కృషి చేయాలి. తద్వారా ప్రపంచ శాంతి, స్థిరత్వం, అభివృద్ధికి సానుకూల శక్తిని అందించాలి. ఇరు దేశాలు ఆధునిక టెక్నాలజీ సాయంతో వేగంగా పురోగతి సాధించాలి" అని షీ జిన్‌పింగ్ పేర్కొన్నారు. చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో ద్వైపాక్షిక సమావేశం అనంతరం ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. బ్రిక్స్ సదస్సుకు అధ్యక్షత వహించిన భారత్‌కు చైనా అందించిన మద్దతు, సహకారానికి కృతజ్ఞతలు తెలియజేశారు. షీ జిన్‌పింగ్‌తో పలు అంశాలపై చర్చించానని వెల్లడించారు. నిర్మాణాత్మక చర్చలకు భారత్ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని ప్రకటించారు. "మీకు (జిన్‌పింగ్‌ను ఉద్దేశించి) హృదయపూర్వక స్వాగతం పలకడం నాకు చాలా ఆనందంగా ఉంది. బ్రిక్స్ సదస్సులో మీరు చేసిన సానుకూల వ్యాఖ్యలకు ధన్యవాదాలు. బ్రిక్స్ సమిట్‌కు అధ్యక్షత వహించిన భారత్‌కు చైనా అందించిన మద్దతు, సహకారానికి నేను కృతజ్ఞతలు తెలుపుతున్నాను. ఇప్పుడు మనకు ద్వైపాక్షిక సహకారంపై చర్చించే అవకాశం లభించింది" అని మోదీ స్పష్టం చేశారు. చివరిసారిగా 2019లో భారత్‌లో పర్యటించిన షీ జిన్‌పింగ్, మళ్లీ ఏడేళ్ల తర్వాత ఇండియా టూర్‌కు వచ్చారు. అంతకుముందు 2016, 2014 జిన్‌పింగ్ భారత్‌లో పర్యటించారు. అయితే, 2020లో గల్వాన్ లోయ ఘర్షణలతో భారత్- చైనా మధ్య సంబంధాలు తీవ్రంగా క్షీణించాయి. దీంతో 2019 తర్వాత భారత పర్యటనకు జిన్‌పింగ్ రాలేదు. ఏడేళ్ల తర్వాత మళ్లీ బ్రిక్స్ సదస్సు కోసం ఇండియాకు వచ్చారు.

# సౌదీ పైప్‌లైన్‌పై ఇరాక్ డ్రోన్ దాడి



రియాద్ : సౌదీ అరేబియాకు చెందిన కీలక పైప్‌లైన్‌పై ఇరాక్ డ్రోన్ల దాడి జరిపింది. ఈ దాడిలో కొందరికి గాయాలయ్యాయని, కొంత ఆస్తినష్టం సంభవించిందని సౌదీ తెలిపింది. దాడిని తీవ్రంగా ఖండించిన సౌదీ 1,200 కిలోమీటర్ల పొడవైన ఆ పైప్‌లైనును తాత్కాలికంగా మూసేసింది. దక్షిణ రాష్ట్రమైన మేసన్‌లోని ఓ ప్రాంతం నుంచి సౌదీ అరేబియా తూర్పు -- పడమర పైప్‌లైన్‌పై దాడి జరిగిన విషయాన్ని ఇరాక్ ప్రధాని కార్యాలయం ధృవీకరించింది. ఈ ఆపరేషన్‌కు నేతృత్వం వహించిన మిలిటరీ కమాండర్‌ను విధుల నుంచి తొలగించామని తెలిపింది. ఈ ఘటనపై ఇరాక్ ప్రధాని అలీ అల్ -- జైదీ విచారణకు ఆదేశించారు. కాగా పరిపాలన, భద్రతా సంబంధమైన కారణాల దృష్ట్యా సరిహద్దు క్రాసింగులను మూసివేయాలని ఇరాక్ అధికారులు శనివారం ఆదేశాలు జారీ చేశారు. ఇరాన్ మద్దతుతో ఇరాక్ నుంచి కార్యకలాపాలు సాగిస్తున్న అనేక మిలిషియా గ్రూపులు తమ చమురు స్థావరాలపై దాడులు చేస్తున్నాయని సౌదీ అరేబియా చాలా కాలంగా ఆరోపిస్తోంది. హార్ముజ్‌లో వాణిజ్య నౌకల రాకపోకలకు తీవ్ర విఘాతం ఏర్పడుతుండడంతో తూర్పు'పడమర పైప్‌లైన్ ద్వారా సౌదీ చమురు సరఫరాలు చేస్తోంది. కాగా ఇరాక్ అభ్యర్థన మేరకు ఎలాంటి ప్రతీకార దాడులకు దిగబోవడం లేదని సౌదీ తెలిపింది. అయితే దేశ సార్వభౌమత్వం, భద్రత, కీలక సదుపాయాల పరిరక్షణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకునే హక్కు తనకు ఉన్నదని స్పష్టం చేసింది.

# బీసీ బాలుర గురుకులంలో ఏం జరుగుతోంది...?

**● ఉపాధ్యాయులపై విద్యార్థుల ఫిర్యాదులు.. కనీస వసతులపై తల్లిదండ్రుల ఆందోళన....!**

దేవరకొండ, సెప్టెంబర్ 12, ( నేటి దర్శిని ): దేవరకొండలోని బీసీ గురుకుల పాఠశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు, నిర్వహణ తీరుపై తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గురుకులంలో కనీస వసతులు సరిగా లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరోవైపు కొంతమంది ఉపాధ్యాయుల తీరుపై విద్యార్థులు ఫిర్యాదులు చేసినట్లు సమాచారం.

**సీసీ కెమెరాలు లేక భద్రతపై ప్రశ్నలు.**

గురుకులంలో సీసీ కెమెరాల ఏర్పాటు లేకపోవడంతో విద్యార్థుల కదలికలను పూర్తిస్థాయిలో పర్యవేక్షించలేకపోతున్నామని ప్రిన్సిపాల్ సాగర్ పేర్కొన్నట్లు సమాచారం. సీసీ కెమెరాల ఏర్పాటుకు పలుమార్లు విన్నవించినప్పటికీ ప్రభుత్వం నుంచి స్పందన లేదని ఆయన చెప్పినట్లు తెలుస్తోంది. దీంతో విద్యార్థుల భద్రత, పర్యవేక్షణపై తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**ఎగ్జిట్ గేట్ వద్ద వాచ్మెన్ ఎక్కడ.....?**

గురుకులంలోని ఎగ్జిట్ గేట్ వద్ద కనీసం వాచ్మెన్ కూడా లేకపోవడం చర్చనీయాంశంగా మారింది. వందలాది మంది విద్యార్థులు ఉండే వసతి గృహంలో ప్రవేశ, నిష్క్రమణలపై పర్యవేక్షణ లేకపోవడం భద్రతాపరమైన సమస్యలకు దారితీసే అవకాశం




ఉందని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. విద్యార్థుల భద్రతకు తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

**నూకల బియ్యం అన్నం తినలేక విద్యార్థుల అవస్థలు....**

గురుకులానికి సివిల్ సప్లై శాఖ నుంచి సరఫరా అవుతున్న బియ్యం నాణ్యతపైనా ప్రశ్నలు తలెత్తుతున్నాయి. బియ్యం సక్రమంగా సరఫరా కాకపోవడం వల్ల నూకలు ఎక్కువగా వస్తున్నాయని ప్రిన్సిపాల్ సాగర్ పేర్కొన్నట్లు సమాచారం. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందేలా సంబంధిత అధికారులు సరఫరా వ్యవస్థను పరిశీలించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

**తెల్లవారుజామున విద్యార్థులతో చపాతీలు చేయిస్తున్నారా..?**

ఇక తెల్లవారుజామున సుమారు 3 గంటల సమయంలో విద్యార్థులను నిద్రలేపి చపాతీలు చేయిస్తున్నారని కొంతమంది తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. విద్యార్థుల చదువు, విశ్రాంతి సమయాలను దృష్టిలో ఉంచకుండా వంట పనుల్లో నిమగ్నం చేస్తున్నారన్న ఆరోపణలపై అధికారులు సమగ్రంగా విచారణ చేయాలని వారు కోరుతున్నారు.

**విద్యార్థులతో వంట పనులు చేయించడం నిబంధనలకు విరుద్ధం కాదా...?**

గురుకుల విద్యార్థులతో వంటలు లేదా ఇతర నిర్వహణ పనులు చేయిస్తున్నారన్న ఆరోపణలు నిజమైతే వాటిపై అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని తల్లిదండ్రులు అంటున్నారు. విద్యార్థుల విద్య, ఆరోగ్యం, భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన గురుకులాల్లో ఇలాంటి పరిస్థితులు నెలకొనడం సరికాదని వారు పేర్కొంటున్నారు.

**అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని తల్లిదండ్రుల డిమాండ్....!**

గురుకులంలో విద్యార్థుల భద్రత, ఆహారం, వసతులు, సిబ్బంది పర్యవేక్షణ తదితర అంశాలపై ఉన్న సమస్యలను ఉన్నతాధికారులు స్వయంగా పరిశీలించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. విద్యార్థుల నుంచి వచ్చిన ఫిర్యాదులపై విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని, సమస్యలు నిజమైతే వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు.

గురుకులంలో విద్యార్థుల పరిస్థితిపై సమగ్ర విచారణ చేపట్టి, వసతులు మెరుగుపరిచి, విద్యార్థుల భద్రతకు పటిష్ట చర్యలు తీసుకుంటారా? అనేది వేచి చూడాలి. మిగతా వివరాలు రేపటి కథనంలో

# కల్తీ పన్నీర్‌పై నలుగురు పాత్రికేయుల పోరాటం అభినందనీయం

**● టిజిఎస్ రాష్ట్ర కార్యదర్శి టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర**

హైదరాబాద్, సెప్టెంబర్12 (నేటి దర్శిని): కల్తీ పన్నీర్ తయారీ విక్రయాలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ ప్రజారోగ్య పరిరక్షణ కోసం నలుగురు పాత్రికేయులు గౌటి రామకృష్ణ, బొడికె వాణి, గంగి కృష్ణ, సతీష్ సాగిస్తున్న పోరాటం అభినందనీయమని తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట్ర కార్యదర్శి టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర అన్నారు.కల్తీ పన్నీర్ తయారీ విక్రయాలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్న పాత్రికేయులపై భౌతిక దాడులు జరుగుతున్నప్పటికీ వారికి రక్షణ కల్పించాల్సిన పోలీసు యంత్రాంగమే పాత్రికేయులపై అక్రమ కేసులు నమోదు చేయడం శోచనీయమని ఆయన పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యం కోసం నిజాలను వెలుగులోకి తీసుకువస్తున్న పాత్రికేయులను వేధించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని



రాజేష్ ఖన్నా పేర్కొన్నారు. పాత్రికేయులు తమ విధులను స్వేచ్ఛగా నిర్వర్తించేలా ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం తగిన రక్షణ కల్పించాలని కోరారు. ఈ విషయంపై తెలంగాణ రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి వెంటనే కలుగజేసుకొని పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడి పాత్రికేయులపై నమోదైన అక్రమ కేసులను ఉపసంహరించుకునేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. అదేవిధంగా పాత్రికేయులపై దాడి చేసిన మాఫియా సభ్యులపై కేసు నమోదు చేసి పూర్తిస్థాయిలో విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ప్రజల శ్రేయస్సు కోసం నిస్వార్థంగా విధులు నిర్వహిస్తున్న పాత్రికేయులపై భవిష్యత్తులో దాడులు వేధింపులు జరగకుండా వారికి తగిన రక్షణ కల్పించేలా పోలీసు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ప్రజారోగ్య పరిరక్షణ కోసం పోరాడుతున్న పాత్రికేయులకు తెలంగాణ గంగపుత్ర సంఘం అండగా నిలుస్తుందని రాష్ట్ర కార్యదర్శి టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర స్పష్టం చేశారు.

# జ్యూట్ బ్యాగులతో జై గణేశ్!.. ప్రకృతిని కాపాడే వినాయక చవితి

**● త్రివేణి కిడ్స్‌లో భక్తిశ్రద్ధలతో వేడుకలు**
**● వినూత్న వినాయకుడితో పర్యావరణ పరిరక్షణపై చిన్నారుల సందేశం..**

పటాన్‌చెరు, సెప్టెంబర్ 12 (నేటి దర్శిని) సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు నియోజకవర్గంలో రామచంద్రపురం బీరంగూడలోని త్రివేణి కిడ్స్ లో వినాయక చవితి వేడుకలను భక్తిశ్రద్ధలు, ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల్లో భారతీయ సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన పెంపొందించడంతో పాటు పర్యావరణ పరిరక్షణపై బాధ్యతను పెంచే ఉద్దేశంతో పలు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు.వేడుకల్లో జ్యూట్ బ్యాగులతో పర్యావరణహిత వినాయక విగ్రహాన్ని రూపొందించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్లాస్టర్ ఆఫ్ పారిస్, ప్లాస్టిక్ వంటి పర్యావరణానికి హానికరమైన పదార్థాలకు దూరంగా ఉంటూ సహజసిద్ధమైన జ్యూట్‌ను వినియోగించి చిన్నారులు తమ సృజనాత్మకతను చాటుకున్నారు. పండుగను ఆనందంగా జరుపుకుంటూనే ప్రకృతిని పరిరక్షించాలనే చక్కటి సందేశాన్ని ఈ వినూత్న ప్రయత్నం ద్వారా అందించారు.వినాయక చవితి సందర్భంగా విద్యార్థులు పాటలు, నృత్యాలు, వివిధ సాంస్కృతిక, వినోదాత్మక కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. చిన్నారుల ప్రదర్శనలు తల్లిదండ్రులను విశేషంగా ఆకట్టుకోగా,



వారు విద్యార్థులను అభినందించారు.ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం మాట్లాడుతూ.. చిన్న వయసు నుంచే విద్యార్థుల్లో పర్యావరణ స్పృహ, బాధ్యతాయుతమైన జీవన విధానం, భారతీయ



సంస్కృతి పట్ల గౌరవాన్ని పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. పండుగల ఆనందాన్ని ఆస్వాదిస్తూనే ప్రకృతిని పరిరక్షించే విధానాలను ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ వీరేంద్ర చౌదరి, సి.ర్.ఓ సాయి నరసింహారావు, ప్రిన్సిపల్ భవాని, క్యాంపస్ ఇన్‌చార్జ్ శ్రీకాంత్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## జాతీయ లోక్ అదాలత్‌లో 3,200 కేసుల పరిష్కారం

**● బాధితులకు రూ.56.65 లక్షలకు పైగా నగదు తిరిగి ఇప్పించిన పోలీసు శాఖ**

మిడ్జిల్ , సెప్టెంబర్ 12 (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో ): జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లా పోలీసు శాఖ సమన్వయంతో వివిధ రకాల కేసులను సమర్థవంతంగా పరిష్కరించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 3,200 కేసులు




పరిష్కరించగా, ఇందులో 432 ఎఫ్ఐఆర్ కేసులు, 752 డీడీ కేసులు, 1,988 ఈ-పెట్టీ కేసులు, 57 సైబర్ క్రైమ్ కేసులు ఉన్నాయి.సైబర్ క్రైమ్ కేసుల్లో బాధితులకు మొత్తం రూ.56,65,935 నగదును తిరిగి ఇప్పించారు. కేసుల పరిష్కార ప్రక్రియలో కోర్టు డ్యూటీ అధికారులు, దర్యాప్తు అధికారులు, పోలీసు సిబ్బంది, కోర్టు సిబ్బంది, ఇతర సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేసి విశేష కృషి చేశారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్ కేసుల పరిష్కారంలో ప్రత్యేక చొరవ చూపిన కోర్టు డ్యూటీ అధికారులు, దర్యాప్తు అధికారులు, పోలీసు అధికారులు, సిబ్బందిని అభినందించారు. భవిష్యత్తులోనూ ఇదే సమన్వయం, అంకితభావంతో పనిచేసి బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా కృషి చేయాలని సూచించారు. ప్రజలకు సత్వర న్యాయం అందించడంలో జాతీయ లోక్ అదాలత్ సమర్థవంతమైన వేదిక అని, పెండింగ్ కేసుల పరిష్కారానికి పోలీసు శాఖ తరఫున పూర్తి సహకారం అందిస్తామని ఎస్పీ తెలిపారు.

## టి.జే.డబ్ల్యు.ఏ జాతీయ సలహాదారుగా డా.కొండ మల్లేశం గౌడ్

**● జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం కోసం మరింత బలంగా గళం..**

హైదరాబాద్ సెప్టెంబర్12 (నేటి దర్శిని): తెలుగు జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ జాతీయ సలహాదారుగా స్థానికం జాతీయ తెలుగు దినపత్రిక సీఈఓ, చీఫ్ ఎడిటర్ డా. కొండ మల్లేశం గౌడ్ నియమితులయ్యారు. జర్నలిస్టుల సంక్షేమం, వృత్తిపరమైన హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారం, ఐక్యత కోసం టి.జే.డబ్ల్యు.ఏ చేపడుతున్న కార్యక్రమాలకు




ఆయన అనుభవం, సేవలు మరింత బలాన్నిస్తాయని సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు.ఈ సందర్భంగా శనివారం నాగోల్‌లోని స్థానికం జాతీయ తెలుగు దినపత్రిక కార్యాలయంలో డా. కొండ మల్లేశం గౌడ్‌ను టి.జే.డబ్ల్యు.ఏ జాతీయ జనరల్ సెక్రటరీ, సందేశం టైమ్స్ సీఈఓ షెట్టి వెంకటేష్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలసి నియామకానికి సంబంధించిన ఐడీ కార్డు, ట్యాగ్‌ను అందజేశారు.ఈ సందర్భంగా షెట్టి వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ.. జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం కోసం టి.జే.డబ్ల్యు.ఏ నిరంతరం కృషి చేస్తోందన్నారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంతో పాటు వృత్తిపరమైన భద్రత, గౌరవం, ఐక్యత కోసం సంఘాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. జాతీయ సలహాదారుగా డా. కొండ మల్లేశం గౌడ్ అందించే సూచనలు, సహకారం సంఘానికి ఎంతో ఉపయోగపడతాయని ఆకాంక్షించారు. జర్నలిస్టుల సంక్షేమం, వృత్తి గౌరవం, హక్కుల పరిరక్షణే లక్ష్యంగా టి.జే.డబ్ల్యు.ఏను మరింత పటిష్టంగా ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరి సహకారం అవసరమని ఆయన అన్నారు.డా. కొండ మల్లేశం గౌడ్‌కు టి.జే.డబ్ల్యు.ఏ జాతీయ సలహాదారు బాధ్యతలు అప్పగించడంపై పలువురు జర్నలిస్టులు, టి.జే.డబ్ల్యు.ఏ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

## ఉత్సవాల్లో భక్తి ఉండాలి.. బాధ్యత కూడా ఉండాలి

**● సామాజిక విశ్లేషకులు కోహిర్ శ్రీనివాస్**

ఎల్బీనగర్ సెప్టెంబర్ 12 (నేటి దర్శిని): నవరాత్రులు, వినాయక నిమజ్జనం ప్రశాంతంగా.. పర్యావరణహితంగా జరుపుకుందాం. పండుగలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిబింబం. నవరాత్రి ఉత్సవాలు, వినాయక నిమజ్జనం భక్తి, విశ్వాసాలకు ప్రతీకలుగా ప్రతి ఏడాది ఘనంగా జరుగుతాయి. అయితే ఈ ఉత్సవాల ఆనందం



ఇతరులకు అసౌకర్యంగా మారకుండా చూసుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత.ఉత్సవాల పేరుతో అధిక శబ్దం, ట్రాఫిక్‌కు అంతరాయం, రహదారుల దిగ్బంధనం వంటి పరిస్థితులు తలెత్తకుండా నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు, అనారోగ్యంతో ఉన్నవారు, అత్యవసర సేవలు పొందాల్సిన వారికి ఇబ్బంది కలగకుండా శబ్ద కాలుష్యాన్ని నియంత్రించాలి.వినాయక నిమజ్జనం సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి. మట్టి విగ్రహాలను ప్రోత్సహించడం, నిమజ్జన ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచడం, ప్లాస్టిక్ వ్యర్థాలను నివారించడం ద్వారా ప్రకృతిని కాపాడుకోవచ్చు.పండుగ మన ఆనందం కోసం.. ఇతరుల ఇబ్బందుల కోసం కాదు. భక్తిశ్రద్ధలకు తోడు సామాజిక బాధ్యతను గుర్తిస్తూ నవరాత్రి ఉత్సవాలు, వినాయక నిమజ్జనాన్ని ప్రశాంతంగా, క్రమశిక్షణతో, పర్యావరణహితంగా నిర్వహిస్తేనే పండుగల అసలైన స్ఫూర్తి నిలుస్తుంది. ప్రజల భద్రత, సౌకర్యం, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ 'మన పండుగ.. అందరి ఆనందం' అనే స్ఫూర్తితో ఉత్సవాలు జరుపుకుందాం. అందరూ భక్తిశ్రద్ధలతో వినాయకుని పూజించే వారికి సుఖసంతోషాలతో సకల సంపదలతో దేశం రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని సామాజిక విశ్లేషకులు కోహిర్ శ్రీనివాస్ ఈ సందర్భంగా అన్నారు

తెలుగు దిన పత్రిక
RNI NO: TGTEL/25/A0471

# అర్జెంటీనాలో రాత్రికి రాత్రే ఎండిపోయిన సముద్రం..

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12 (నేటి దర్శిని)**
అర్జెంటీనా లో రాత్రికి రాత్రే సముద్ర వెనక్కి వెళ్లిపోయింది. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. అయితే ఇది ప్రకృతి వైపరీత్యం కాదని, కేవలం ఒక తాత్కాలిక సహజ ప్రక్రియ మాత్రమేనని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. అర్జెంటీనాలోని మార్ డెల్ ప్లాటా తీరంలో అట్లాంటిక్ మహాసముద్రం నీరు సుమారు 23 కిలోమీటర్ల మేర వెనక్కి తగ్గినట్టు వార్తలు వచ్చాయి.సముద్రం వెనక్కి తగ్గడంవల్ల, సాధారణంగా నీటిలో మునిగి ఉండే 'రెస్టింగా డెల్ ఫారో' అనే భారీ శిలా ప్రదేశం పూర్తిగా బయటపడింది. తీరంలో నిలిచిపోయిన పడవలు, వెనక్కి వెళ్ళిన సముద్రగర్భం దృశ్యాలను చూసి స్థానికులు, పర్యాటకులు




విస్మయానికి గురయ్యారు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో, సముద్రం ఎండిపోయిందనే తప్పుడు ప్రచారం జోరందుకుంది. అయితే ఇది సునామీ హెచ్చరికగానీ, సముద్రం శాశ్వతంగా ఎండిపోవడంగానీ కాదని నిపుణులు తేల్చిచెప్పారు. తీరం నుంచి సముద్రం వైపు బలమైన గాలులు వీయడం, అదే సమయంలో సముద్రపు పోటు తక్కువగా ఉండటంవల్ల నీరు తాత్కాలికంగా వెనక్కి వెళ్లిందని వివరించారు. కొన్ని గంటల వ్యవధిలోనే నీటిమట్టం తిరిగి సాధారణ స్థాయికి చేరుకుందని అర్జెంటీనా మీడియా వెల్లడించింది. సాధారణంగా భూకంపం సంభవించినప్పుడు నీరు వేగంగా వెనక్కి వెళ్లి, తిరిగి భారీ అలలతో విరుచుకుపడితే దానిని సునామీగా పరిగణిస్తారు. కానీ ఇక్కడ కేవలం వాతావరణ మార్పులవల్లే నీరు వెనక్కి వెళ్లి, అనంతరం తిరిగి ప్రశాంతంగా యథాస్థితికి చేరుకుంది. కాబట్టి సముద్రం అదృశ్యమైందంటూ వస్తున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని నిపుణులు స్పష్టంచేశారు.

# ఆరేళ్ల మేనకోడలిపై హత్యాచారం..

**నిందితుడికి మరణశిక్ష విధించిన కోర్టు**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12 (నేటి దర్శిని)**
చిన్నారి బాలికపై అత్యాచారం, హత్యకు పాల్పడిన నిందితుడికి ఫాస్ట్ ట్రాక్ కోర్టు మరణ శిక్ష విధించింది. ఈ మేరకు కోర్టు తాజాగా శిక్ష ఖరారు చేసింది. బాలికపై అత్యాచారానికి పాల్పడింది ఆమె మేనమామే కావడం గమనార్హం. చత్తీస్‌గడ్‌లోని దుర్గ్ జిల్లాలో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలివి. దుర్గ్ జిల్లాలోని ఓం నగర్ ఉర్లా ప్రాంతంలో గత ఏడాది ఏప్రిల్‌లో ఈ ఘటన జరిగింది. ఆరేళ్ల ఒక చిన్నారి స్థానిక ఫెస్టివల్ సందర్భంగా తన అమ్మమ్మ ఇంటికి వెళ్లింది.అయితే, సాయంత్రం చీకటైన తర్వాత కూడా ఆ చిన్నారి వాళ్ల ఇంటికి వెళ్లలేదు. దీంతో బాలిక కుటుంబం చుట్టుపక్కలా వెతికారు. ఎక్కడా కనిపించకపోవడంతో మోహన్ నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.





ఈ క్రమంలో బాలిక కోసం గాలిస్తుండగా.. దగ్గర్లోని ఒక కారు ఢిక్కీలో చిన్నారి మృతదేహం లభ్యమైంది. అప్పటికే ఒంటిపై కొన్ని గీతలున్నాయి. పెదవుల నుంచి రక్తస్రావం జరిగింది. దీంతో పోలీసులు చిన్నారి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించగా అత్యాచారం జరిగినట్లు వెల్లడైంది. అత్యాచారం చేసి, హత్య చేసినట్లు తేలింది. ఇదే సమయంలో ఆధారాలు దొరకకూడదనే ఉద్దేశంతో చిన్నారి మర్మాంగాలపై టాయిలెట్ క్లీనర్ పోసినట్లు కూడా వెల్లడైంది. ఈ అంశంపై పోలీసులు విచారణ జరపగా.. చిన్నారి మేనమామ సోమేష్ యాదవ్ ఈ హత్యాచారానికి పాల్పడ్డట్లు తేలింది. పోలీసుల్ని తప్పుదోవ పట్టించేందుకు, ఆధారాలు దొరకకుండా ఉండేందుకు చాలా ప్రయత్నాలు చేశాడు. పోలీసులు నిందితుడైన మేనమామను అరెస్టు చేసి, పోక్సో కేసు నమోదు చేశారు. ఈ కేసు విచారణ జరిపేందుకు దుర్గ్ జిల్లా కేంద్రంలో ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేశారు. 17 నెలల్లోనే ఈ కేసు విచారణ పూర్తైంది. ఈ కేసును అత్యంత అరుదైన ఘటనగా భావించిన కోర్టు.. నిందితుడికి మరణశిక్ష విధించింది. అడిషనల్ సెషన్స్ జడ్జి అనిష్ దూబే.. ఈ మేరకు తీర్పు వెల్లడించారు.

# అమెరికాలో భారత సంతతి యువతి హత్య

**ఆ తర్వాత దుండగుడి ఆత్మహత్య**

**కాలిఫోర్ని సెప్టెంబర్ 12 (నేటి దర్శిని)**
: భారత సంతతికి చెందిన యువతిని ఓ దుండగుడు అమెరికాలోని కాలిఫోర్నియాలో కాల్చి చంపేశాడు. షాలిని (38) వెయిట్రెస్‌గా పనిచేస్తున్నది. ఆమె పనిచేసే చోటుకు



వచ్చిన రోహిత్ (22) పరిచయం అయ్యాడు. షాలినిని ప్రేమించాలని, పెళ్లి చేసుకోవాలంటూ వేధిస్తున్నాడు. వయసు తేడా కారణంగా అతన్ని షాలిని తిరస్కరించింది.దీంతో కక్ష పెంచుకున్న రోహిత్ శుక్రవారం షాలినిని వెంటాడి కాల్చి చంపాడు. సమాచారం అందుకున్న పోలీసులు అతన్ని పట్టుకునేందుకు చుట్టుముట్టగా.. హైవే మీద కారు ఆపి తనను తాను కాల్చుకుని చనిపోయాడు. రోహిత్ అక్రమ వలసదారుడని పోలీసులు గుర్తించారు. అతను గతంలో అరిజోనాలో అక్రమ చొరబాటు కారణంగా జైలుకు వెళ్లాడు. హత్య జరగడానికి గంట ముందు కూడా షాలిని తనతో మాట్లాడిందని.. మళ్లీ చేస్తానని చెప్పిన కొద్ది సేపటికే ఇలా జరిగిందని ఆమె తల్లి సుదేష్ కుమారి చెప్పారు.


# తాగుబోతుల ఆరోగ్యం ఏమౌతుంది?

**పుణెలో 10 రోజులపాటు మద్యనిషేధంపై హైకోర్టు ఆగ్రహం**



**ముంబై,న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12 (నేటి దర్శిని)**
వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా 10 రోజుల పాటు మద్యంపై నిషేధం విధించినందుకు పుణె పాలనా యంత్రాంగాన్ని బాంబే హైకోర్టు మందలించింది. మద్యానికి బానిసైన వ్యక్తులు 10 రోజుల పాటు మద్యం తీసుకోలేకపోతే వారితో దవాఖానలు కిక్కిరిసిపోవచ్చని కోర్టు వ్యాఖ్యానించింది. పుణెలో మాత్రమే మద్య నిషేధం విధించడంలోని ఔచిత్యం ఏమిటని ప్రధాన న్యాయమూర్తి ఎంపీ త్రిపాఠి, న్యాయమూర్తి అద్వైత్ సేథ్నాలతో కూడిన ధర్మాసనం శుక్రవారం విచారణ సందర్భంగా ప్రశ్నించింది.హైకోర్టు మందలింపు దరిమిలా 10 రోజుల మద్య నిషేధాన్ని పుణె యంత్రాంగం రెండు రోజులకు తగ్గించింది. 14వ తేదీ సాయంత్రం 4 గంటల నుంచి 25వ తేదీ రోజంతా మద్యం అమ్మకాలు, వినియోగంపై యంత్రాంగం నిషేధం విధించింది. విచారణ సందర్భంగా ధర్మాసనం కొన్ని కీలక వ్యాఖ్యలు చేసింది. మద్యం తాగి ఉన్నా లేకున్నా శాంతి భద్రతలకు ఎవరైనా విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవలసిందేనని కోర్టు స్పష్టం చేసింది.

# బ్రిటన్ పైలట్లకు భారత్ ఇన్‌స్ట్రక్టర్ల శిక్షణ



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12 (నేటి దర్శిని)**
అర్హత కలిగిన తమ ముగ్గురు ఫ్లయింగ్ ఇన్‌స్ట్రక్టర్లను(క్యూఫ్‌ఐ) వేల్స్‌లోని రాయల్ ఎయిర్ ఫోర్స్(ఆర్‌ఏఎఫ్) వ్యాలీకి పంపుతున్నట్టు భారత వైమానిక దళం(ఐఏఎఫ్) ప్రకటించింది. బ్రిటన్‌లో రాయల్ ఎయిర్ ఫోర్స్ పైలట్లకువారు తొలిసారిగా శిక్షణ ఇవ్వనున్నారు.. భారత్-బ్రిటన్ రక్షణ సహకారంలో ఈ మోహరింపు ఒక చరిత్రాత్మక తొలి ఘట్టంగా ఐఏఎఫ్ అభివర్ణించింది.ఇది ఇరు దేశాల మధ్య వృత్తిపరమైన నైపుణ్యం, పరస్పర సమన్వయం, సుదీర్ఘకాలంగా ఉన్న రక్షణ సంబంధాలను మరింత బలోపేతం చేస్తుందని ఎక్స్ వేదికగా ఐఏఎఫ్ పేర్కొంది. ఏప్రిల్ నెల ప్రారంభంలో రక్షణ కార్యదర్శి రాజేష్ కుమార్ సింగ్ బ్రిటన్ జాతీయ భద్రతా సలహాదారు జోనాథన్ నికోలస్ పావెల్‌తో ప్రాంతీయ భద్రతా పరిణామాలపై చర్చలు జరిపారు. ప్రస్తుత భారత్-బ్రిటన్ రక్షణ సహకార చట్టాల పురోగతిని కూడా వారు సమీక్షించారు.

# ఏఐ దూకుడుకు బ్రేక్ వేయాలి

**-ఆంత్రోపిక్ సీఈవో**



**న్యూయార్క్: సెప్టెంబర్ 12 (నేటి దర్శిని)**
ఏఐ సంస్థలు తమ మోడళ్లను మెరుగుపరిచే వేగాన్ని ఉద్దేశపూర్వకంగా తగ్గించాలని ఆంత్రోపిక్ సీఈవో డారియో అమోడీ కోరారు. ఏఐ సామర్థ్యాలు వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ఈ సాంకేతికతను అర్థం చేసుకోవడం, నియంత్రించడం కోసం జరుగుతున్న ప్రయత్నాలను అవి అధిగమించే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు. సెప్టెంబర్‌లో 'వీ మస్ట్ పేస్ ది ఫ్రంటియర్' పేరుతో రాసిన వ్యాసంలో అమోడీ ఈ విధంగా స్పందించారు. అభివృద్ధి వేగాన్ని తగ్గించినప్పటికీ ఏఐ పురోగతి వేగంగానే కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు. అయితే లభించే అదనపు సమయాన్ని భద్రతా చర్యలను మరింత బలోపేతం చేయడానికి, కొత్తగా తలెత్తుతున్న ప్రమాదాలను పరిష్కరించడానికి ఉపయోగించవచ్చని తెలిపారు.

## సంపాదకీయం

# కమలంపై అఖిలేశ్ యుద్ధభేరీ



భారత్‌లో దాదాపు 25 కోట్ల జనాభా, 80 లోక్‌సభ స్థానాలు కలిగిన యుపి 19వ శాసనసభ 403 స్థానాలకు వచ్చే ఏడాది ఆరంభంలో జరిగే ఎన్నికలకు అధికార బిజెపి, ప్రధాన ప్రతిపక్షం సమాజ్‌వాదీ పార్టీ నేతలు అప్పుడే 'యుద్ధభేరి' మోగించారు. ముఖ్యమంత్రి యోగి ఆదిత్య నాథ్ సారథ్యంలో మళ్లీ విజయ సాధనతో 2029 లోక్‌సభ ఎన్నికల్లో తిరుగులేని అధికారాన్ని సుస్థిరం చేసుకోవాలని కమలనాథులు వ్యూహాత్మకంగా పావులుకదుపుతున్నారు. కాగా గత పదేళ్లుగా అధికారానికి దూరంగా ఉన్న ప్రధాన ప్రతిపక్షం సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ (53) 19వ శాసనసభ ఎన్నికలలో సత్తాచాటి అధికారంలోకి రావడానికి సకల శక్తులు ఒడ్డుతున్నారు. కమలం పార్టీని గద్దె దించాలంటే ఆ పార్టీకి ప్రధాన మద్దతుదార్లుగాఉన్న బ్రాహ్మణులను సైకిల్ వైపు తిప్పుకోవాలని అఖిలేశ్ బ్రాహ్మణ సమ్మేళనాలు, పూజలలో పాల్గొంటూ వారిని ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. 2012 నుండి 14 ఏళ్లపాటు లోక్‌సభ సభ్యురాలిగా ఉన్న ఆయన సతీమణి డింపుల్ యాదవ్ కూడా ఇప్పుడు పార్టీ వ్యవహారాలలో క్రియాశీలక పాత్ర వహిస్తూ వివిధ వర్గాలను పార్టీ వైపు ఆకర్షించే ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద ప్రశ్నపత్రాల లీకేజీపై నిరసన తెలుపుతున్న బొద్దింకల (సిజెపి) పార్టీ నేతలు, యువతకు, ఆమరణ దీక్ష చేస్తున్న లడఖ్‌నేత సోనమ్ వాంగ్‌చుక్‌ను స్వయంగా కలిసి సంఘీభావం ప్రకటించారు. పార్లమెంటు వెలుపల తరచూ పత్రికా ప్రతినిధులను కలుసుకొని తాజా రాజకీయ పరిణామాలను, వారి విశ్లేషణలను తెలుసుకుంటున్నారు. అయోధ్య రామాలయానికి వచ్చిన వేలకోట్ల విరాళాలను ట్రస్టీలు దిగమింగడం, రాముని పేరుతో, భక్తి పేరుతో దగా చేయడం, నీట్ ప్రశ్నపత్రం లీకేజీ, విద్యార్థుల ఆత్మహత్యల గురించి డింపుల్, సమాజ్‌వాదీ ఎంపిలు లోక్‌సభలో ఎండగట్టారు. సమాజ్‌వాదీ పార్టీ వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి వస్తే అర్హులైన మహిళలకు 'మహిళా సమ్మాన్ యోజన' కింద ఏటా వారి ఖాతాల్లో రూ. 40 వేలు జమ చేస్తామని అఖిలేశ్, డింపుల్ దంపతులు పత్రికా ప్రతినిధుల సమావేశంలో వాగ్దానం చేసి మహిళలను ఆకట్టుకున్నారు. బీహార్‌లో ఎన్నికల వేళ నితీశ్ నేతృత్వంలో ప్రధాని మోడీ దన్నుతో ముఖ్యమంత్రి మహిళా సమ్మాన్ నిధి కింద రూ. 15 వేలు మహిళల ఖాతాలలో జమచేసి ఎన్‌డిఎ అధికారంలోకి వచ్చిన సంగతి తెలిసిందే. అందుకే ఇప్పుడు ప్రధాన పార్టీలకు మహిళలకు నగదు బదిలీ చేయడం 'తారక మంత్రంగా' మారింది. కాగా సమాజ్‌వాదీ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలపట్ల దురుసుగా వ్యవహరించారని, హింస, దౌర్జన్యాలు పెరిగి ప్రజా జీవితం దుర్భరంగా మారిందని సిఎం యోగీ ఆదిత్యనాథు, ఉపముఖ్యమంత్రి కేశవప్రసాద్ మౌర్య తదితర కమల నేతలు సాగిస్తున్న ప్రచారాన్ని తిప్పికొట్టడానికి మృదుస్వభావి, మెయిన్‌పురి ఎంపి డింపుల్ గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ ఎన్నికలు బిజెపి, సంఘ్‌పరివార్‌కు కీలకమైనవి. మోడీ, అమిత్ షా, యోగి ప్రతిష్ఠకు పరీక్షే. అయోధ్య బాల రామాలయం నిర్మాణానికి భక్తులు ఇచ్చిన వేల కోట్ల విరాళాలను ట్రస్టు సభ్యులు కాజేసినట్లు స్పష్టమైన సాక్ష్యాధారాలు లభించడంతో కొందరు రాజీనామా చేశారు. దైవభక్తి, పాపభీతి లేని ఈ నీతిమాలిన పనులు, జ్ఞానం, శీలం, ఏకత గురించి గొప్పలు చెప్పిన సంఘ ప్రతిష్ఠను బాగా దెబ్బతీశాయి. 2014 లోక్‌సభ ఎన్నికల్లో గుజరాత్ లోని వదోదర, వారణాసి నియోజకవర్గాల నుండి ఎన్నికైన మోడీ వదోదర స్థానానికి రాజీనామా చేసి వారణాసి నుంచి పోటీ చేస్తూ యుపిని కర్మ భూమిగా ఎంచుకుని, గంగా ప్రక్షాళన, ఎన్నో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. యుపి తొలినాళ్ళలో నెహ్రూ, ఇందిరాగాంధీ కుటుంబాలకు కంచుకోట. యుపిలో 10% ఉన్న బ్రాహ్మణులు అక్కడి పరిపాలన, సామాజిక రంగాల్లో అత్యంత ముఖ్యపాత్ర పోషించి గట్టిపట్టు సాధించారు. చరణ్ సింగ్ నాయకత్వంలో ప్రత్యామ్నాయ నేతలు వచ్చే వరకు యుపి కాంగ్రెస్ ముఖ్యమంత్రులు అందరూ బ్రాహ్మణులే. కమలాపతి త్రిపాఠీ వంటి పండితులు ఇందిరమ్మ తరపున పార్టీ అఖిల భారత వ్యవహారాలను చక్కబెడుతూ చక్రం తిప్పే వారు. పివి నరసింహారావు, సి రాజగోపాలాచారి ప్రాముఖ్యత తెలిసిందే. పండిత గోవింద వల్లభ పంతు, హెచ్‌ఎన్ బహుగుణ, ఎన్‌డి. తివారీ, శంకర్‌దయాల్ శర్మ, షీలా దీక్షిత ప్రభృతుల ప్రాబల్యం తెలిసిందే. విపి సింగ్ తిరుగుబాటు చేసి నేషనల్ ఫ్రంట్ తరపున ప్రధాని అయ్యాకే మార్పులు మొదలయ్యాయి. యుపి జనాభాలో 20%పైగా దళితులు, 19% అల్పసంఖ్యాక వర్గాలు, 10% బ్రాహ్మణుల కూర్పుతో ఇందిరమ్మ హయాంలో ఎదురులేని పాలన సాగించారు. నిర్లక్ష్యానికి గురైన బిసిలు చరణ్‌సింగ్ లోక్‌దళ్, ములాయం సింగ్ యాదవ్ సమాజ్‌వాదీ పార్టీ, ఆంధ్రప్రదేశ్‌లో ఎన్‌టిఆర్ తెలుగుదేశం, తమిళనాడులో డిఎంకె, కర్ణాటకలో జనతాదళ్ వెంటనడిచారు. బిజెపి జనవిభజన రాజకీయాలతో మెజారిటీ వర్గాలను కూడగట్టి, ఇతర పార్టీలను చీలుస్తూ, నిర్వీర్యం చేస్తూ ఎదురు లేకుండా చేస్తున్నది. బిఎస్‌పి అధినేత్రి మాయావతిని కట్టడి చేసినందున కేసుల భయంతో ఆమె నిరాసక్తత తో ఉన్నందున జాతవులు, తదితర దళిత ఉపకులాలు ఇతర పార్టీల వైపు చూస్తున్నాయి. 2027 అసెంబ్లీ ఎన్నికల్లో ఓడితే ఐదేళ్లపాటు పార్టీని నడపడం కష్టం. అందుకే ఈసారి బిసిలు, దళితులు, బ్రాహ్మణుల బంధంతో, మైనారిటీల మద్దతుతో ఎలాగైనా అధికారంలోకి రావాలని అఖిలేశ్ శక్తివంచన లేకుండా ప్రయత్నిస్తున్నారు. అయితే బిజెపికి గట్టి మద్దతు దార్లుగా ఉన్న బ్రాహ్మణులు, వైశ్యులు ఏమేరకు స్పందిస్తారో చూడాలి. గత లోక్‌సభ ఎన్నికల్లో మోడీ మళ్ళీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మారుస్తారని రాహుల్, అఖిలేశ్ బాగా ప్రచారం చేయడంతో ఈసారి 400 స్థానాలు అని ఊదర గొట్టిన మోడీ కమలం పార్టీకి 240 స్థానాలే దక్కడంతో, చంద్రబాబు తెలుగుదేశం 17, నితీశ్ జెడి(యు) 13మంది ఎంపిల మద్దతుతో మనుగడ సాగిస్తున్నది. అఖిలేశ్, కాంగ్రెస్ కూటమికి 37 లోక్‌సభ సీట్లు దక్కాయి. యుపిలో సోషలిస్ట్ నేత, బ్రాహ్మణులకు ఆరాధ్యుడు, చోటా లోహియాగా మన్నన పొందిన శ్రీజ్ఞానేశ్వర్ మిశ్రా శతజయంతి ఉత్సవ సభలో బిసి, దళిత, మైనారిటీ, బ్రాహ్మణ వర్గాల కూర్పును అఖిలేశ్ ప్రకటించారు. శివతాండవ స్తోత్రములు చదువుతుండగా అఖిలేశ్ త్రిశూలం ధరించి వేదికపై కలియ తిరిగి బ్రాహ్మణులను ఆకట్టుకున్నారు. అఖిలేశ్ 2012లో తొలిసారి అధికారంలోకి వచ్చినపుడు బ్రాహ్మణుల ప్రాబల్యం అధికంగా ఉన్న 100 స్థానాల్లో సమాజ్‌వాదీ 50 స్థానాలలో గెలిచింది. మోడీ ప్రభుత్వం ఇబిసిలకు స్వల్ప కోటా ప్రకటించిందే గాని, ఉద్యోగ, ఉపాధి అవకాశాల పెంపు, ఆర్థికాభివృద్ధికి చేసింది ఏమీ లేదనే అసంతృప్తి బ్రాహ్మణులు, ఇతర అగ్రకులాలలో ఎక్కువగా ఉంది. యుపిలో బిజెపి గత పదేళ్లుగా అధికారంలో వున్నందున సహజంగానే ప్రభుత్వం మీద వ్యతిరేకత ఉంది. యుజిసి నిబంధనలు, కులగణనపై బ్రాహ్మణులు, ఇతర అగ్ర వర్ణాలు ఏమంత సంతోషంగా లేరు. తండ్రి ములాయం వలే గాక హిందూ ప్రార్థనా చిహ్నములు త్రిపుండ్రాలు, విభూతి ధరించడానికి అఖిలేశ్ సిద్ధమే. హనుమాన్ చాలీసా చదువు తూ సనాతన ధర్మం ప్రజలను సమైక్యంగా ఉంచడానికే గాని చీల్చడానికి కాదని కమలనాథులపై నిప్పులు చెరిగారు. మళ్ళీ విజయం కమలం పార్టీదే: యోగి వచ్చేఎన్నికల్లోనూ విజయం కమలం పార్టీదేనని యుపి ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యనాథు ధీమా వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు, ఉద్యోగ, ఉపాధి కల్పన పర్యాటక అభివృద్ధి, ఉద్యోగ నియామకాల్లో ఖచ్చితత్వం వల్ల ప్రజాదరణ పెరిగిందని, ఈ పథకాల వల్ల లబ్ధి పొందిన మహిళలు, యువత, రైతులు, దళితులు మళ్ళీ కమలం పార్టీకే ఓటు వేస్తారని యోగీ విశ్వాసం వ్యక్తం చేశారు.

## భక్తుల కోసం 'శ్రీ వినాయక వ్రతకల్పం'
# పుస్తక ఆవిష్కరణ



**ఖమ్మం, సెప్టెంబర్ 12 (నేటి దర్శిని):**
వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తుల సౌకర్యార్థం ప్రత్యేకంగా ముద్రించిన 'శ్రీ వినాయక వ్రతకల్పం' పుస్తకాన్ని ప్రముఖ వ్యాపారవేత్త, ఖమ్మం క్లాత్ అండ్ రెడీమేడ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, గెల్లా గ్రాండ్ అధినేత గెల్లా రవి శుక్రవారం గెల్లా గ్రాండ్‌లో ఆవిష్కరించారు. వినాయక పూజా విధానం ప్రతి భక్తుడికి సులభంగా అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో ఈ పుస్తకాన్ని ముద్రించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా గెల్లా రవి మాట్లాడుతూ హిందూ పండుగల్లో వినాయక చవితికి విశిష్ట స్థానం ఉందన్నారు. భాద్రపద శుద్ధ చవితి రోజున విఘ్నేశ్వరుడిని భక్తిశ్రద్ధలతో పూజించి, జీవితంలోని విఘ్నాలు తొలగిపోవాలని భక్తులు కోరుకుంటారని పేర్కొన్నారు. సంప్రదాయబద్ధమైన పూజా విధానాన్ని సులభంగా అందరికీ చేరువ చేయాలనే సంకల్పంతో 'శ్రీ వినాయక వ్రతకల్పం' పుస్తకాన్ని భక్తులకు అందిస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి, ప్రముఖ వ్యాపారవేత్త కల్వకుంట్ల గోపాల్, సీనియర్ జర్నలిస్ట్, వాసవి జర్నలిస్టు ఫోరం వ్యవస్థాపక సభ్యుడు టీఎస్ చక్రవర్తి మాట్లాడుతూ వినాయక చవితి సందర్భంగా భక్తులకు ఉపయోగపడే పూజా విధానాన్ని పుస్తక రూపంలో అందించడం అభినందనీయమన్నారు. గెల్లా రవి సేవాభావంతో పాటు సాదాసీదా స్వభావంతో సమాజంలోని అన్ని వర్గాలతో కలిసిమెలిసి ఉంటారని కొనియాడారు.
కార్యక్రమంలో పులిపాటి వాసవి నగర్ అధ్యక్షులు కొదుమూరి భద్రయ్య, తెలంగాణ రాష్ట్ర ఆర్య వైశ్య రాష్ట్ర అధ్యక్షులు సిద్ధంశెట్టి శ్రీకాంత్, జిల్లా ఆర్య వైశ్య సభ నాయకులు బూర్లె పుల్లారావు, వ్యాపారవేత్తలు గెల్లా శ్రావణ్, గెల్లా సుజన్ కుమార్, వందనపు కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆకలితో ఉన్న వారికి అన్న దానం

- ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ వద్ద సుమారు 200 మందికి మధ్యాహ్న భోజనం పంపిణీ

**హైదరాబాద్, సెప్టెంబరు 12 (నేటి దర్శిని):**
ఆకలితో ఉన్న వారికి అండగా నిలవడం, ఆపదలో ఉన్నవారికి మానవతా దృక్పథంతో సహాయం అందించడమే లక్ష్యంగా యూనివర్సల్ హ్యూమానిటీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం నిర్వహించారు. దీమ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ప్రైవేట్ లిమిటెడ్ వారి సహకారంతో హైదరాబాద్‌లోని ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ వద్ద సుమారు 200 మందికి స్వచ్ఛందంగా మధ్యాహ్న భోజనాన్ని పంపిణీ చేశారు. క్యాన్సర్ వంటి తీవ్రమైన అనారోగ్యంతో ఆసుపత్రులకు వచ్చే రోగులు, వారి కుటుంబ సభ్యులు అనేక రకాల ఇబ్బందులను ఎదుర్కొంటుంటారని, ముఖ్యంగా దూర ప్రాంతాల నుంచి వచ్చే పేద, మధ్యతరగతి కుటుంబాలకు వైద్య ఖర్చులతో పాటు రోజువారీ భోజనం కూడా భారంగా మారుతుందని నిర్వాహకులు తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో కనీసం ఒక పూట భోజనాన్ని అందించడం ద్వారా వారికి కొంత ఊరట కలిగించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రి పరిసరాల్లో ఆకలితో ఉన్న వారిని గుర్తించి, వారికి ఆప్యాయతతో భోజనం అందించారు. ఎలాంటి ప్రతిఫలాపేక్ష లేకుండా సమాజంలోని అవసరమైన వారికి సహాయం చేయడమే నిజమైన మానవత్వానికి నిదర్శనమని కార్యక్రమంలో పాల్గొన్న వారు



పేర్కొన్నారు. ఈ సేవా కార్యక్రమంలో యూనివర్సల్ హ్యూమానిటీ చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ కింతల విజయరాణి, వైస్ ప్రెసిడెంట్ శ్రావ్య అర్చన, కొలిపాక సాయికిరణ్, మొహమ్మద్ రఫీక్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని సమన్వయం చేస్తూ అవసరమైన వారికి భోజనం అందించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ప్రతినిధులు మాట్లాడుతూ, "ఆకలితో ఉన్న వ్యక్తికి ఒక పూట భోజనం అందించడం కేవలం ఆహారం ఇవ్వడం కాదు.. ఆ సమయంలో అతనికి అండగా నిలవడం. మానవత్వం, సేవాభావం ప్రతి ఒక్కరిలో పెంపొందాలి. సమాజంలో అవసరమైన వారిని గుర్తించి వారికి చేతనైన సహాయం అందించాలనే లక్ష్యంతో యూనివర్సల్ హ్యూమానిటీ చారిటబుల్ ట్రస్ట్ ముందుకు సాగుతుంది" అని తెలిపారు. అలాగే, ఈ సేవా కార్యక్రమానికి సహకారం అందించిన దీమ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ప్రైవేట్ లిమిటెడ్ యాజమాన్యానికి, నిర్వాహకులకు ట్రస్ట్ ప్రతినిధులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సేవా కార్యక్రమాలకు సంస్థ అందిస్తున్న సహకారం అభినందనీయమని, భవిష్యత్తులో కూడా మరిన్ని మానవతా కార్యక్రమాలను కలిసి నిర్వహించేందుకు సహకారం కొనసాగించాలని ఆకాంక్షించారు. సమాజంలో ఆర్థికంగా వెనుకబడినవారు, అనారోగ్యంతో బాధపడుతున్న కుటుంబాలు, ఆకలితో ఉన్న నిరుపేదలను గుర్తించి వారికి అవసరమైన సమయంలో సహాయం అందించడమే ట్రస్ట్ ప్రధాన లక్ష్యాల్లో ఒకటని నిర్వాహకులు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఆహార పంపిణీతో పాటు విద్య, వైద్యం, పేద కుటుంబాలకు సహాయం, అత్యవసర పరిస్థితుల్లో మానవతా సేవలు వంటి పలు కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టనున్నట్లు వెల్లడించారు. "ఒక్కరి ఆకలి తీర్చడం చిన్న సహాయం కావచ్చు.. కానీ ఆ వ్యక్తికి అది ఆ రోజు అందిన గొప్ప మానవత్వం కావచ్చు" అనే సందేశంతో సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని ట్రస్ట్ ప్రతినిధులు తెలిపారు.

## పాలమూరు-రంగారెడ్డి నీటిని నల్లగొండకు మళ్లించే డిండి లిఫ్ట్ రద్దు చేయాలి

- ఉమ్మడి మహబూబ్‌నగర్ పెండింగ్ ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలి
- నాగర్‌కర్నూల్‌లో జరిగిన సత్యాగ్రహ దీక్ష లో షాద్ నగర్ నాయకులు



**రంగారెడ్డి జిల్లా సెప్టెంబర్ 12 (నేటి దర్శిని):**
పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం నీటిని డిండి ఎత్తిపోతల పథకం పేరుతో నల్లగొండ జిల్లాకు తరలించడం అన్యాయమని, పాలమూరు ప్రాంతానికి దక్కాల్సిన నీటిని ఇతర ప్రాంతాలకు మళ్లించే చర్యలను తక్షణమే నిలిపివేయాలని ఉమ్మడి మహబూబ్‌నగర్ పెండింగ్ ప్రాజెక్టుల సాధన జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలని కోరుతూ శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా గాంధీ పార్కులో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సత్యాగ్రహ దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం నీటిని నల్లగొండకు మళ్లించే డిండి ఎత్తిపోతల పథకాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌ను నిర్మించాలని, అమ్రాబాద్ ఎత్తిపోతల పథకాన్ని చేపట్టాలని కోరారు. కృష్ణా--భీమా నదుల సంగమ ప్రాంతమైన తంగిడి నుంచి 72వ జీవో ప్రకారం భారీ ఎత్తిపోతల పథకాన్ని చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న అన్ని సాగునీటి ప్రాజెక్టులను తక్షణమే పూర్తి చేసి, ఈ ప్రాంత రైతులకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పాలమూరు ప్రాంత హక్కులను కాపాడేందుకు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని నాయకులు తెలిపారు. ఈ సత్యాగ్రహ దీక్ష కార్యక్రమంలో టి.జి. శ్రీనివాస్, మనసాని రాంరెడ్డి, మిద్దెల సత్యనారాయణ, తీర్మాలయ్య, అర్జునప్ప, రవీంద్రనాథ్, మందారం నర్సింహులు, పసుపుల ప్రశాంత్, ఆకాష్ నాయక్, శివతో పాటు జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

## దక్షిణ తెలంగాణను
# అవమానిస్తే సహించం





- కేటీఆర్ వ్యాఖ్యలను ఖండించిన కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అవ్వారి శివలింగం

**ఆమనగల్లు, సెప్టెంబర్ 12(నేటి దర్శిని):**
ఫ్యూచర్ సిటీపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు కాంగ్రెస్ మున్సిపల్ పట్టణ అధ్యక్షుడు అవ్వారి శివలింగం అన్నారు. శనివారం ఆమనగల్లు పట్టణ కేంద్రంలోని రాజీవ్ గాంధీ చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులతో కలిసి కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అవ్వారి శివలింగం మాట్లాడుతూ.. ఫ్యూచర్ సిటీలో ఫ్యూచర్ లేదంటూ కేటీఆర్, హరీశ్‌రావు మాట్లాడటం దక్షిణ తెలంగాణ ప్రజలను అవమానించడమేనని ఆయన మండిపడ్డారు. దక్షిణ తెలంగాణకు చెందిన రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత ఫ్యూచర్ సిటీతో పాటు ఈ ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు. గత పాలకుల హయాంలో పాలమూరు జిల్లా వలసల జిల్లాగా మారిందని, ఉపాధి కోసం ప్రజలు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితులు ఉండేవని విమర్శించారు. పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకం విషయంలో గత ప్రభుత్వం ఏం చేసిందో బీఆర్ఎస్ నాయకులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఫ్యూచర్ సిటీ అభివృద్ధిని కించపరిచేలా, దక్షిణ తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేస్తే కాంగ్రెస్ పార్టీ తరపున తీవ్రంగా ప్రతిఘటిస్తామని హెచ్చరించారు. దక్షిణ తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోవాలని చూస్తే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ వస్పుల శ్రీశైలం, కోఆప్షన్ సభ్యుడు అబ్దుల్ ఖాదర్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు దావ ధనంజయ, కాలే మల్లయ్య, INTUC జిల్లా అధ్యక్షుడు ఎంగలి ప్రసాద్, గాజుల సురేష్, అబ్దుల్ అలీమ్, వగ్గు మహేష్, కండె సాయి, అండేకర్ రాజు, శ్రీపాల్, హరిలాల్, కొండల్‌రెడ్డి, సురేష్ నాయక్, దేవరశెట్టి మహేష్, నాజర్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వస్పుల శ్రీకాంత్,దుడ్డు కృష్ణయాదవ్, పూసల వెంకటేష్, శ్రీనునాయక్, అంజాత్, ఫిరోజ్, మజీద్, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని బిజెపి డిమాండ్



**(నేటి దర్శిని): తొర్రూర్ మండల్ సెప్టెంబర్:12**
తొర్రూర్ అర్బన్:
భారతీయ జనతా పార్టీ పాలకుర్తినియోజకవర్గంలో భారతీయ జనతా పార్టీ ప్రెస్ మీట్ లో పాల్గొన్న రాష్ట్ర అధికార ప్రతినిధి వన్నాల వెంకటరమణ మరియు లేగ రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ చరిత్రలో సెప్టెంబర్ 17 కు ఎంతో ప్రత్యేకమైన ప్రాధాన్యత ఉందని నిజాం నిరంకుశ పాలన నుంచి తెలంగాణ ప్రజలకు విముక్తి లభించిన ఈరోజును రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా తెలంగాణ విమోచన దినోత్సవం గా ప్రకటించాలని బిజెపి నాయకులు డిమాండ్ చేశారు ఈ యొక్క కార్యక్రమంలో తొర్రూరు బిజెపి అర్బన్ మండల అధ్యక్షుడు ఫైండ్ల రాజేష్ జిల్లా ఉపాధ్యక్షులు రంగు రాములు పల్లె కుమార్ చింత సృజన్ ఓ బి సి మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొలుపుల శంకర్ అలిసేరి రవిబాబు పూసల శ్రీమాన్ మండల అధ్యక్షులు గట్టు రాంబాబు కటోజు భాస్కరాచారి ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు దేవరకొండ విష్ణువర్ధన్ జనరల్ సెక్రటరీ. నడిగడ్డ సందీప్ జిల్లా సీనియర్ నాయకులు తూర్పాటి సాయి ముఖేష్ నూకల నవీన్ తూర్పాటి మోహిత్ మరియు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు

# తాళం వేసిన ఆరోగ్య ఉపకేంద్రం వైద్యం కోసం ప్రజల అవస్థలు

- భవనం ఉన్నా సిబ్బంది లేక నిరుపయోగం
- వృద్ధులు, గర్భిణులు, చిన్నారులకు తప్పని తిప్పలు

**చింతపల్లి, సెప్టెంబర్ 12 (నేటి దర్శిని):**
చింతపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ఆరోగ్య ఉపకేంద్రం ప్రజలకు అందుబాటులో లేకపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ నిధులతో భవనం నిర్మించినప్పటికీ వైద్య సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో కేంద్రానికి తాళం వేసి ఉండే పరిస్థితి నెలకొంది. దీంతో ప్రాథమిక వైద్యం కోసం కూడా ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది.ముఖ్యంగా వృద్ధులు, గర్భిణులు, చిన్నారులు, నిరుపేద కుటుంబాలు అనారోగ్యానికి గురైనప్పుడు గ్రామంలోనే వైద్య సేవలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జ్వరం, రక్తపోటు వంటి సాధారణ ఆరోగ్య సమస్యలకు కూడా దూర ప్రాంతాలకు వెళ్లాల్సి రావడంతో ప్రయాణ ఖర్చులు భరించలేకపోతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.సిబ్బంది లేక.. సేవలు కరువు




ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన ఆరోగ్య ఉపకేంద్రం సిబ్బంది కొరత కారణంగా నిరుపయోగంగా మారడం పట్ల గ్రామస్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కేంద్రాన్ని నిత్యం తెరిచి ఉంచి అవసరమైన ప్రాథమిక వైద్య సేవలు అందించాలని కోరుతున్నారు.అధికారులు వెంటనే స్పందించాలి: నల్ల ఆంజనేయులు ఈ విషయంపై ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు నల్ల ఆంజనేయులు మాట్లాడుతూ.. అధికారులు వెంటనే స్పందించి గ్రామ ప్రజల ఆరోగ్య సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ఆరోగ్య ఉపకేంద్రాన్ని ప్రతిరోజూ తెరిచి ఉంచాలి.ఏఎన్ఎంను పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచాలి.ఆశా కార్యకర్తల ద్వారా ప్రజలకు అవసరమైన ఆరోగ్య సేవలు అందించాలి.
కేంద్రంలో అవసరమైన మందులు, ప్రాథమిక వైద్య పరికరాలు అందుబాటులో ఉంచాలి.గర్భిణులు, వృద్ధులు, చిన్నారులకు అవసరమైన వైద్య సేవలు గ్రామంలోనే అందేలా చర్యలు తీసుకోవాలి.ఆరోగ్య ఉపకేంద్రం పనితీరుపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలి.జిల్లా కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు తక్షణమే స్పందించి చింతపల్లి ఆరోగ్య ఉపకేంద్రాన్ని పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని నల్ల ఆంజనేయులు డిమాండ్ చేశారు.

RNI NO: TGTEL/25/A0471 · తెలుగు దిన పత్రిక
www.epaper.netidarshini.com · ఆదివారం 13-09-2026

# శేరిలింగంపల్లి నియోజకవర్గంలో రూ. 2.84 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన!





**రంగారెడ్డి జిల్లా , సెప్టెంబర్ 12(నేటి దర్శిని):** మియాపూర్ డివిజన్ పరిధిలోని మయూరి నగర్, అభయాంజనేయ కాలనీ, ఎణఖీజ బ్యాంక్ హైటెన్షన్ లైన్ రోడ్డు, శ్రీల గార్డెన్ కాలనీలలో రూ.2 కోట్ల 84 లక్షల 50 వేల రూపాయల అంచనావ్యయంతో నూతనంగా చేపట్టబోయే బీటీ రోడ్లు, సీసీ రోడ్ల నిర్మాణం పనులకు, ఓపెన్ జిమ్, చిల్డ్రన్ ప్లే ఏరియా నిర్మాణం పనులకు తాజా మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ తో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొని శంకుస్థాపన చేసిన పియెసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ.ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ.. ప్రజల సంక్షేమం మరియు శేరిలింగంపల్లి నియోజకవర్గం మరియు కాలనీ ల అభివృద్దే ధ్యేయంగా ప్రజల సౌకర్యార్థం మియాపూర్ డివిజన్ పరిధిలోని మయూరి నగర్, అభయాంజనేయ కాలనీ, ఎణఖీజ బ్యాంక్ హైటెన్షన్ లైన్ రోడ్డు, శ్రీల గార్డెన్ కాలనీలలో రూ.2 కోట్ల 84 లక్షల 50 వేల రూపాయల అంచనావ్యయంతో నూతనంగా చేపట్టబోయే బీటీ రోడ్డు, సీసీ రోడ్ల నిర్మాణం పనులకు, ఓపెన్ జిమ్, చిల్డ్రన్ ప్లే ఏరియా నిర్మాణం పనులకు శంకుస్థాపన చేసుకోవడం జరిగినది అని, సీసీ రోడ్ల పనులకు, ఓపెన్ జిమ్ వంటి అభివృద్ధి నిర్మాణం పనులకు, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసుకోవడం చాలా సంతోషకరమైన విషయం అని, కాలనీల వాసులకు నేటితో ఉపశమనం లభించింది అని తెలిపారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకంలో మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో శేరిలింగంపల్లి నియోజకవర్గం ను అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తామని , శేరిలింగంపల్లి నియోజకవర్గం ను అగ్రభాగాన నిలబెడుతామని తెలిపారు.

సంక్షేమం మరియు అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకం లో శేరిలింగంపల్లి నియోకజకర్గంను అన్ని రంగాలలో అభివృద్ధి చేసి ఆదర్శవంతమైన ,అగ్రగామి నియోజకవర్గంగా తీర్చిదితానని తెలియచేసారు. అదేవిధంగా మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తామని, అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని , నాణ్యత విషయంలో ఎక్కడ రాజి పడకూడదని ప్రజలకు ట్రాఫిక్ రహిత , సుఖవంతమైన , మెరుగైన రవాణా సౌకర్యం కొరకు శాయ శక్తుల కృషి చేస్తానని,అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తానని చెప్పడం జరిగినది. పనుల్లో జాప్యం లేకుండా త్వరిత గతిన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించడం జరిగినది , ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కలిపిస్తామని ,ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా సుఖవంతమైన ప్రయాణానికి బాటలు వేస్తామని చెప్పడం జరిగినది.

ప్రతి కాలనీ లో ఓపెన్ జిమ్ లను ఏర్పాటు చేస్తామని, ఓపెన్ జిమ్ లను ప్రారంభించుకోవడం జరిగినది అని, ఆరోగ్య శేరిలింగంపల్లి నా ధ్యేయం అని, ప్రతి కాలనీ లో, పార్క్ లలో ఓపెన్ జిమ్ లను ఏర్పాటు చేస్తామని, ఓపెన్ జిమ్ ల ద్వారా ప్రతి రోజు వ్యాయమం చేసుకోవడానికి ఎంతగానో తోడ్పడుతాయి అని, వృద్ధులకు, పిల్లలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పిస్తామని, చిన్న పిల్లలకు ఆడుకునే విధంగా ఆటవిడుపు పరికరాలను ఏర్పాటు చేయడం జరిగినది అని అన్నారు.

శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని ,అన్నివేళలో ప్రజలకు అందుబాటులోకి ఉంటానని ,మెరుగైన ప్రజా జీవనానికి అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు తనవంతు కృషి చేస్తానని, మియాపూర్ డివిజన్ మరియు శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని పునరుద్ఘాటించారు.

**శంకుస్థాపన చేసిన కార్యక్రమాల వివరాలు :**

మంజూరైన అభివృధి పనుల వివరాలు

1. మియాపూర్ డివిజన్ పరిధిలోని మయూరి నగర్ కాలనీ లో గల కోరుకొండ కోచింగ్ సెంటర్ సమీపంలో గల పార్క్ లో రూ. 60 లక్షల 50 వేల రూపాయల అంచనా వ్యయంతో నూతనంగా చేపట్టబోయే సిసి రోడ్డు నిర్మాణం మరియు ఓపెన్ జిమ్ నిర్మాణం పనులకు
2. మియాపూర్ డివిజన్ పరిధిలోని అభయాంజనేయ కాలనీ లో రూ. 23 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నూతనంగా చేపట్టబోయే ఓపెన్ జిమ్ నిర్మాణం పనులకు
3. మియాపూర్ డివిజన్ పరిధిలోని శ్రీల గార్డెన్ కాలనీలో రూ. 46.00 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నూతనంగా చేపట్టబోయే ఓపెన్ జిమ్ నిర్మాణం పనులకు
4. మియాపూర్ డివిజన్ పరిధిలోని ఎణఖీజ బ్యాంక్ బొల్లారం రోడ్డు నుండి హైటెన్షన్ లైన్ రోడ్డు లో Coconut Grooves అపార్ట్మెంట్స్ వరకు రూ.155 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నూతనంగా చేపట్టబోయే దీ రోడ్డు నిర్మాణం పనులకు

పైన పేర్కొన్న అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడం జరిగినది అని తెలియచేసారు.

ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు, మహిళా సోదరీమణులు , కాలనీల అసోసియేషన్ సభ్యులు,మహిళలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# కామ్రేడ్ సీతారాం ఏచూరి ఆశయాలను కొనసాగిస్తాం

**- సీపీఎం నాయకులు**



**రంగారెడ్డి జిల్లా , సెప్టెంబర్ 12 (నేటి దర్శిని):** సిపిఎం పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి గారి ఆశయాలను కొనసాగిస్తూ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతామని సీపీఎం నాయకులు అన్నారు . సీతారాం ఏచూరి గారి రెండో వర్ధంతిని పురస్కరించుకొని సీపీఎం షాద్నగర్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో ఘనంగాఏచూరి గారి చిత్రపటానికి నివాళులర్పించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీతారాం ఏచూరి గారు భారత కమ్యూనిస్టు ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని అన్నారు. దేశంలో ప్రజాస్వామ్యం, లౌకికవాదం, సామాజిక న్యాయం, పేదలు, కార్మికులు, రైతుల హక్కుల కోసం ఆయన జీవితాంతం పోరాడారని తెలిపారు.కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రజలను ఐక్యం చేసి పోరాటాలను మరింత ఉధృతం చేయడమే సీతారాం ఏచూరి గారికి నిజమైన నివాళి అని అన్నారు. ఆయన చూపిన మార్గంలో సీపీఎం కార్యకర్తలు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు రాజు, శ్రీను నాయక్, భుజంగ రెడ్డి చెన్నయ్య రాజు నాయక్ లలిత తదితరులు పాల్గొన్నారు.

# నేషనల్ హ్యూమన్ రైట్స్ జాతీయ ఉపాధ్యక్షులుగా చెరుకు రామకృష్ణగౌడ్ నియమకం..



చెరుకు రామకృష్ణగౌడ్..

**(నేటి దర్శిని), ఎల్బీనగర్:** నేషనల్ హ్యూమన్ రైట్స్ జాతీయ ఉపాధ్యక్షులు తెలంగాణ రాష్ట్రం. । ఎల్బీనగర్కు చెందిన చెరుకు రామకృష్ణగౌడ్ను నియామిస్తూ నేషనల్ హ్యూమన్ రైట్స్ అధ్యక్షులు డాక్టర్ కె. ఎస్ జ్యోతిశ్వర్ రెడ్డి ఉత్వర్యులు జారీ చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణగౌడ్ మాట్లాడుతూ. దేశంలో హ్యూమన్ రైట్స్ హక్కుల కోసం నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. రాష్ట్రంలోమానవ హక్కుల సంరక్షణకు, అవినీతికి వ్యతిరేకంగా పోరాడుతానని పేర్కొన్నారు. తనపై నమ్మకం ఉంచి తనను జాతీయ ఉపాధ్యక్షులు నియమించిన జాతీయ అధ్యక్షులు జ్యోతిశ్వర్రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# శేరిలింగంపల్లి నియోజకవర్గంకు చెందిన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేసిన చైర్మన్ ఆరెకపూడి గాంధీ.



**రంగారెడ్డి జిల్లా సెప్టెంబర్ 12 (నేటి దర్శిని):** అల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని లోని గోదాకృష్ణ ఫంక్షన్ హాల్ లో జరిగిన శేరిలింగంపల్లి నియోజకవర్గం కు చెందిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ASO కళ్యాణ్ తాజా మాజీ కార్పొరేటర్లు దొడ్ల వెంకటేష్ గౌడ్, నార్నె శ్రీనివాస రావు తో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొని లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేసిన చైర్మన్ ఆరెకపూడి గాంధీ.

ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్మార్ట్ రేషన్ కార్డు ల పంపిణీ కార్యక్రమం ను రాష్ట్రవ్యాప్తంగా శ్రీకారం చుట్టడం జరిగినది అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల పక్షపాతి అని, పేద ప్రజల ఆకలి తీర్చే ఆపద్భాంధవుడు అని, అనునిత్యం పేదల కోసం తపించే మహనీయుడు మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, అని, పేదల ఆకలి తీర్చడానికి పెద్ద మనస్సుతో సన్నా బియ్యం ఇవ్వడం జరుగుతుంది అని, ఒకప్పుడు ఉన్నత కుటుంబాలు మాత్రమే తినే వారు అని, పేద వారికి కూడా అందని ద్రాక్ష లాగా ఉన్న సన్న బియ్యం ను పేదవాడి కంచంలో ముద్దగా అందించిన గొప్ప దార్శనికుడు మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కు శేరిలింగంపల్లి నియోజకవర్గం పేద ప్రజల తరుపున, నా తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేస్తున్నాను అని తెలియచేశారు.శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలో మొత్తం 94,482 రేషన్ కార్డు ల ను పంపిణీ చేయడం జరిగినది అని, రేషన్ కార్డు ల పంపిణీ అనేది నిరంతర ప్రక్రియ అని, అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులను అందచేస్తామని, ప్రతి పేద వాడికి సంక్షేమ పథకాలు అందేలా చూడటమే నా కర్తవ్యం అని , అభివృధి , సంక్షేమం నా ధ్యేయం అని తెలియచేశారు .

ప్రజాపంపిణీ వ్యవస్థను సాంకేతికంగా బలపరుస్తూ, ప్రజలకు మరింత పారదర్శకంగా రేషన్ అందించాలనే ఉద్దేశ్యంతో స్మార్ట్ కార్డులను ప్రవేశపెట్టడం జరిగినది అని, ఈ కార్డు లో క్యూ ఆర్ కోడ్ తో ఉండటం జరుగుతుంది అని, మొత్తం కుటుంబ వివరాలు పొందుపర్చడం జరిగినది అని, ఎక్కడ కూడా ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఉండే విధంగా , పారదర్శకంగా, పటిష్టంగా స్మార్ట్ కార్డు ను రూపొందించడం జరిగినది అని, సులభతరంగా తీసుకువెళ్ళడానికి ఉపయోగపడుతుంది అని తెలియచేశారు.

సన్న బియ్యం అందించాలనే సంకల్పం తో రైతులకు సన్న రకం బియ్యం ఎక్కువ మోతాదులో పండించేందుకు గాను నగదు ప్రోత్సాహకం అందించడం జరుగుతుంది అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దూరదృష్టి తో తీసుకున్న గొప్ప నిర్ణయం అని తెలియచేశారు.శేరిలింగంపల్లి నియోజకవర్గంలో కొత్త రేషన్ కార్డు లు మంజూరి అయినవి అని, అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు అందిస్తామని, రేషన్ కార్డు ల పంపిణీ నిరంతరం జరిగే కార్యక్రమం అని, అర్హులైన ప్రతి ఒక్కరు తప్పనిసరిగా మీ సేవ లో దరఖాస్తు చేసుకొని రేషన్ కార్డు పొందాలని ప్రజలకు తెలియజేయడం జరిగినది.పెరుగుతున్న జనాభా కనుగుణంగా ప్రజావసరాల దృష్ట్యా రేషన్ షాప్ లను మరిన్ని పెంచాలని, ప్రజలకు మరింత సౌకర్యంగా అందుబాటులో ఉండే విధంగా రేషన్ షాప్ లను ఏర్పాటు చేయాలని తెలియచేశారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టడం జరిగినది అని, మహిళా యోజన పథకం, కింద 50 వేల రూపాయలు అందచేయడం జరిగినది అని, కళ్యాణ లక్ష్మీ షాదిముబారక్ పథకం కింద పేదింటి మహిళ పెండ్లి కి పెద్దన్న గా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిలిచారు అని, గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల పక్షపాతి అని, మహిళ అభ్యున్నతి కోసం విశేషంగా కృషి చేస్తున్నారు అని, మహిళలను కోటీశ్వరులు చేయడం లో భాగంగా ఎల్లమ్మబండ లో పెట్రోల్ బంక్ ను త్వరలోనే ఏర్పాటు చేసుకోవడం జరుగుతుంది అని, అదేవిధంగా మహిళా భవనం కూడా త్వరలోనే నిర్మించుకోవడం జరుగుతుంది అని, అభివృద్ధి మరియు సంక్షేమం ధ్యేయంగా పనిచేస్తున్నామని, శేరిలింగంపల్లి నియోజకవర్గం అన్ని రకాల మౌలిక వసతులు కల్పించడం జరిగినది అని, శేరిలింగంపల్లి అగ్రగామి నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే నా ధ్యేయం అని తెలియచేశారు.

ఈ కార్యక్రమంలో అధికారులు నాయకులు, కార్యకర్తలు, రేషన్ డీలర్లు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# షాద్ నగర్‌లో పెరిగిన జనాభా.. కరువైన ప్రభుత్వ పాఠశాలలు..

- జనాభా పెరుగుతోంది.. ప్రభుత్వ బడులు ఎందుకు పెరగడం లేదు..?
- పదేళ్లలో 15 ప్రైవేట్ స్కూళ్లు.. ఒక్క ప్రభుత్వ బడి ఏది..? పసుపుల ప్రశాంత్ నిలదీత..
- పేద విద్యార్థుల చదువుపై ప్రభుత్వ నిర్లక్ష్యం..
- షాద్‌నగర్‌లో కొత్త ప్రభుత్వ పాఠశాలను ఏర్పాటు చేయాలి పసుపుల ప్రశాంత్ డిమాండ్..



**రంగారెడ్డి జిల్లా , సెప్టెంబర్ 12 (నేటి దర్శిని):** షాద్‌నగర్ పట్టణంలో జనాభా నానాటికీ పెరుగుతున్నప్పటికీ, దానికి అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలల సంఖ్య పెరగకపోవడం పట్ల పసుపుల ప్రశాంత్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం ఆయన మీడియాకు ఒక ప్రకటన విడుదల చేస్తూ విద్యా రంగంపై ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎండగట్టారు.గడిచిన పదేళ్ల కాలంలో షాద్ నగర్ పట్టణంలో దాదాపు 10 నుండి 15 వరకు ప్రైవేట్ పాఠశాలలు కొత్తగా వెలిసాయన్నారు. ప్రైవేట్ యాజమాన్యాలు పట్టణ అవసరాలను గుర్తించి విద్యాసంస్థలను ఏర్పాటు చేస్తుంటే, ప్రజలకు ఉచిత నాణ్యమైన విద్యను అందించాల్సిన ప్రభుత్వం మాత్రం ఒక్క కొత్త పాఠశాలను కూడా నిర్మించకపోవడం సిగ్గుచేటని విమర్శించారు.పెరిగిన జనాభా వల్ల ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ పాఠశాలలపై తీవ్ర ఒత్తిడి పెరుగుతోందని, పేద, మధ్యతరగతి విద్యార్థులకు సీట్లు దొరకడమే కష్టంగా మారిందని ఆయన పేర్కొన్నారు. దీనివల్ల తప్పనిసరి పరిస్థితుల్లో పేదలు సైతం అప్పులు చేసి ప్రైవేట్ స్కూళ్లకు వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి, పెరిగిన జనాభా అవసరాలకు తగ్గట్టుగా షాద్‌నగర్‌లో నూతన ప్రభుత్వ పాఠశాలను మంజూరు చేయాలని, మౌలిక వసతులను కల్పించాలని పసుపుల ప్రశాంత్ డిమాండ్ చేశారు.

# బిజినెస్

## భారీగా పెరిగిన కాపర్ ధరలు..
# ఎలక్ట్రానిక్స్ తయారీలో కీలక మార్పులు!

హైదరాబాద్

ప్రపంచవ్యాప్తంగా రాగి (కాపర్)కు డిమాండ్ భారీగా పెరుగుతుండటంతో దాని ధరలు గణనీయంగా పెరుగుతున్నాయి. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), డేటా సెంటర్ల విస్తరణతో రాగి వినియోగం వేగంగా పెరిగింది. దీంతో గత ఏడాది కాలంలో కాపర్ ధరలు సుమారు 45 శాతం మేర పెరిగినట్లు తెలుస్తోంది. కాపర్ ధరల పెరుగుదల ప్రభావం ఎలక్ట్రానిక్స్ తయారీ రంగంపైనా పడుతోంది. ఏసీలు, ఫ్రిజ్‌లు వంటి గృహోపకరణాల తయారీలో రాగిని విస్తృతంగా ఉపయోగిస్తారు. ముడి పదార్థాల ధరలు పెరగడంతో కంపెనీల ఉత్పత్తి వ్యయాలు కూడా పెరుగుతున్నాయి. ఈ అదనపు భారాన్ని తగ్గించుకునేందుకు తయారీ సంస్థలు ప్రత్యామ్నాయ లోహాల వైపు దృష్టి సారిస్తున్నాయి.

**అల్యూమినియం వైపు మొగ్గు**

కాపర్‌కు బదులుగా అల్యూమినియంను వినియోగించే అవకాశాలను కంపెనీలు పరిశీలిస్తున్నాయి. కొన్ని పరికరాల్లో రాగి స్థానంలో అల్యూమినియంను ఉపయోగించడం ద్వారా తయారీ వ్యయాన్ని కొంతమేర తగ్గించుకోవచ్చని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి.



అయితే పనితీరు, మన్నిక, ఉష్ణ వాహకత వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ప్రత్యామ్నాయాలపై నిర్ణయం తీసుకోనున్నారు.


**వినియోగదారులపై ప్రభావం**

కాపర్ ధరల పెరుగుదల కొనసాగితే రాబోయే రోజుల్లో కొత్తగా మార్కెట్లోకి వచ్చే ఏసీలు, ఫ్రిజ్‌ల ధరలపై ప్రభావం పడే అవకాశం ఉంది. తయారీ వ్యయాలు పెరిగితే కంపెనీలు ఆ భారాన్ని కొంతవరకు వినియోగదారులపై మోపే అవకాశం లేకపోలేదు. అంతేకాకుండా ఎలక్ట్రానిక్ పరికరాల పునర్వినియోగ మార్కెట్‌పైనా దీని ప్రభావం పడే అవకాశం ఉంది. ముఖ్యంగా సెకండ్ హ్యాండ్ స్మార్ట్‌ఫోన్ల ధరలు కూడా పెరిగే అవకాశాలు ఉన్నాయని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

**ఏఐ, డేటా సెంటర్లే ప్రధాన కారణం**

ఏఐ ఆధారిత సాంకేతికత విస్తరణతో భారీ స్థాయిలో డేటా సెంటర్ల నిర్మాణం జరుగుతోంది. విద్యుత్ మౌలిక వసతులు, సర్వర్లు, కేబుల్స్, ఇతర పరికరాల్లో కాపర్ కీలక పాత్ర పోషిస్తోంది. దీంతో ప్రపంచవ్యాప్తంగా రాగికి డిమాండ్ మరింత పెరుగుతోంది. ఈ పరిస్థితి కొనసాగితే కాపర్ ధరలు మరింత పెరిగే అవకాశం ఉందన్న అంచనాలు కూడా వినిపిస్తున్నాయి. ఇలా ఒకవైపు కాపర్ ధరల పెరుగుదల తయారీ కంపెనీలపై ఒత్తిడి పెంచుతుండగా.. మరోవైపు ఉత్పత్తి వ్యయాలను నియంత్రించుకునేందుకు ప్రత్యామ్నాయ లోహాల వినియోగంపై పరిశ్రమ దృష్టి సారిస్తోంది. ఫలితంగా రాబోయే రోజుల్లో ఎలక్ట్రానిక్స్ తయారీ రంగంలో కీలక మార్పులు చోటుచేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# జొమాటో మరో షాక్.. క్యాష్ ఆన్ డెలివరీపై ఫీజు!




**న్యూఢిల్లీ**

ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ సంస్థ జొమాటో వినియోగదారులకు మరో షాక్ ఇచ్చింది. క్యాష్ ఆన్ డెలివరీ (సీఓడీ) ద్వారా ఆర్డర్లు చేసే కస్టమర్ల నుంచి ఇకపై రూ.5 అదనపు ఛార్జీ వసూలు చేయడం ప్రారంభించింది. ఆదాయాన్ని పెంచుకోవడంతో పాటు వినియోగదారులను డిజిటల్ చెల్లింపుల వైపు మళ్లించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. జొమాటోలో ఆహారం ఆర్డర్ చేసే సమయంలో వినియోగదారులు ఇప్పటికే రెస్టారెంట్ ప్యాకేజింగ్ ఛార్జీలు, జీఎస్టీ, ప్లాట్‌ఫామ్ ఫీజు వంటి వివిధ రకాల రుసుములు చెల్లిస్తున్నారు. తాజాగా క్యాష్ ఆన్ డెలివరీని ఎంచుకునే వారికి మరో రూ.5 అదనపు భారం పడనుంది. దీంతో నగదు చెల్లింపులతో చేసే ఆర్డర్లు గతంతో పోలిస్తే మరింత ఖరీదుగా మారనున్నాయి. ఇదిలా ఉండగా.. జొమాటో ఇటీవల ప్లాట్‌ఫామ్ ఫీజును కూడా పెంచింది. ఒక్కో ఆర్డర్‌పై గతంలో రూ.12.50గా ఉన్న ఫీజును రూ.14.90కి పెంచినట్లు తెలుస్తోంది. వరుసగా రుసుములు పెరుగుతుండటంతో ఆహారం ఆర్డర్ చేసే వినియోగదారులపై మొత్తం వ్యయం పెరుగుతోంది. ముఖ్యంగా తరచుగా ఆన్‌లైన్‌లో ఆహారం ఆర్డర్ చేసేవారిపై ఈ ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశం ఉంది.ఫుడ్ డెలివరీ రంగంలో పోటీ తీవ్రంగా ఉన్న నేపథ్యంలో సంస్థలు లాభదాయకతను కాపాడుకునేందుకు పలు మార్గాలను అనుసరిస్తున్నాయి. నగదు లావాదేవీల నిర్వహణకు అయ్యే ఖర్చులను తగ్గించుకోవడంతో పాటు డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించేందుకు జొమాటో ఈ అదనపు ఛార్జీని తీసుకొచ్చినట్లు మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. అయితే వరుసగా ఫీజులు పెంచడం వినియోగదారులపై ఎలాంటి ప్రభావం చూపుతుందన్నది ఆసక్తికరంగా మారింది.

# రికార్డు స్థాయికి ఫారెక్స్ నిల్వలు

ముంబై

భారత విదేశీ మారక నిల్వలు సరికొత్త రికార్డు సృష్టించాయి. సెప్టెంబర్ 4తో ముగిసిన వారంలో దేశ ఫారెక్స్ నిల్వలు ఏకంగా 44.903 బిలియన్ డాలర్లు పెరిగి జీవితకాల గరిష్ఠమైన 785.706 బిలియన్ డాలర్లకు చేరాయి. అంతకుముందు వారంలోనూ నిల్వలు 11.475 బిలియన్ డాలర్లు పెరగడం గమనార్హం. వరుసగా రెండు వారాలుగా భారీగా పెరగడంతో దేశ విదేశీ మారక నిల్వలు రికార్డు స్థాయికి చేరుకున్నాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చేపట్టిన ప్రత్యేక చర్యలు ఫారెక్స్ నిల్వల పెరుగుదలకు ప్రధాన కారణంగా నిలిచాయి. జూన్‌లో ఆర్‌బీఐ చేపట్టిన ప్రత్యేక ఫారెక్స్ స్వాప్ చర్యల ద్వారా సుమారు 136 బిలియన్ డాలర్ల మేర కొత్త నిధులు దేశంలోకి రావడంతో నిల్వలు గణనీయంగా పుంజుకున్నాయి. దీంతో అంతర్జాతీయ




ఆర్థిక ఒత్తిళ్లను ఎదుర్కొనేందుకు భారత్‌కు మరింత బలమైన విదేశీ మారక నిల్వల మద్దతు లభించింది.మరోవైపు, సెప్టెంబర్ 4తో ముగిసిన వారంలో ఫారిన్ కరెన్సీ అసెట్స్ (ఎఫ్‌సీఏ) కూడా భారీగా పెరిగాయి. ఇవి 47.498 బిలియన్ డాలర్లు పెరిగి 648.168 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. దేశ ఆర్థిక వ్యవస్థకు ఫారెక్స్ నిల్వలు కీలకమైన రక్షణగా పనిచేస్తాయి. దిగుమతుల చెల్లింపులు, అంతర్జాతీయ ఆర్థిక ఒడుదొడుకులు, రూపాయి విలువపై ఒత్తిళ్లను ఎదుర్కొనే సామర్థ్యాన్ని ఇవి పెంచుతాయి. తాజా రికార్డుతో భారత విదేశీ మారక నిల్వల స్థాయి మరింత బలోపేతమైంది.

# ఎడ్జ్‌బాస్టన్‌లోనూ చిత్తైన పాకిస్థాన్..

**-3-0తో సిరీస్ గెలుపొందిన ఇంగ్లండ్..!**



ఎడ్జ్‌బాస్టన్ టెస్టులోనూ ఇంగ్లండ్ జయభేరి మోగించింది. స్వల్ప ఛేదనలో ఓపెనర్లు డకౌటైనా కెప్టెన్ జో రూట్(62 నాటౌట్), జోర్డాన్ కాక్స్(59 నాటౌట్) కీలక భాగస్వామ్యంతో పాక్ ఆశలపై నీళ్లు చల్లారు. మొహమ్మద్ అబ్బాస్(2-27) నిప్పులు చెరిగినా.. ఈ జోడి నింపాదిగా ఆడడంతో ఆతిథ్య జట్టు 8 వికెట్ల తేడాతో విక్టరీ కొట్టింది. వరసగా మూడు మ్యాచుల్లో గెలుపొందిన ఇంగ్లండ్ 3-0తో సిరీస్‌ను కైవసం చేసుకుంది.స్వదేశంలో ఇంగ్లండ్ పంజా విసిరింది. మూడు టెస్టుల సిరీస్‌లో సంపూర్ణ ఆధిపత్యంతో పాకిస్థాన్‌ను క్లీన్‌స్వీప్ చేసింది. ఎడ్జ్‌బాస్టన్‌లో తొలిరోజు నుంచే పట్టుబిగించిన ఇంగ్లండ్.. నాలుగో రోజే మ్యాచ్‌ను ముగించింది. రెండో ఇన్నింగ్స్‌లో పాక్‌ను 449 పరుగులకే కట్టడి చేసి.. అనంతరం 130 పరుగుల ఛేదనకు దిగిన ఆ జట్టు ఇన్నింగ్స్ మొదటి ఓవర్లోనే ఓపెనర్లను కోల్పోయింది.

**నో బాల్ కావడంతో**

పాకిస్థాన్ పేసర్ మొహమ్మద్ అబ్బాస్(2-20) ఓవర్లో తొలి బంతికి డకెట్(0) వికెట్ కీపర్ చేతికి చిక్కగా.. ఆఖరి బంతికి ఎమిలియో గే(0)ను ఎల్బీగా వెనుదిరిగాడు. అబ్బాస్ విజృంభనతో సున్నాకే రెండు వికెట్లు పడినా కెప్టెన్ జో రూట్(62 నాటౌట్), జోర్డాన్ కాక్స్(59 నాటౌట్) లు ఒత్తిడికి లోనవ్వలేదు. 23 పరుగుల వద్ద బౌల్డయ్యాడు. కానీ, అది నో బాల్ కావడంతో రూట్ బతికిపోయాడు. పాక్ పేసర్లను ధీటుగా ఎదుర్కొన్న ఈ ద్వయం శతక భాగస్వామ్యం నెలకొల్పగా ఆతిథ్య జట్టు 8 వికెట్ల తేడాతో గెలిచింది. తద్వారా 3-0తో సిరీస్‌ను కైవసం చేసుకుంది ఇంగ్లండ్.ఎడ్జ్‌బాస్టన్‌లో ఇప్పటివరకూ ఒక్క మ్యాచూ గెలవని పాక్ ఈసారి కూడా అదే తడబాటుతో మూల్యం చెల్లించుకుంది. ఇక బెన్ స్టోక్స్ వీడ్కోలు తర్వాత మళ్లీ కెప్టెన్సీ చేపట్టిన రూట్ తొలి సిరీస్‌ను ఒడిసిపట్టాడు. డాన్ లారెన్స్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా, ఓలీ రాబిన్సన్ 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్'గా ఎంపికయ్యారు.

# సచిన్, రహానేకు మరో గౌరవం..

**-వాంఖడేలో ప్రత్యేక లాంజ్‌లు ఏర్పాటు!**

**ముంబై:**

భారత మాజీ క్రికెటర్లు సచిన్ టెండూల్కర్, అజింక్యా రహానేలకు మరో అరుదైన గౌరవం దక్కనుంది. ముంబై క్రికెట్‌కు, టీమిండియాకు విశేష సేవలందించిన వీరి పేర్లను వాంఖడే స్టేడియంలోని లాంజ్‌లకు పెట్టాలని ముంబై క్రికెట్ సంఘం (ఎంసీఏ) నిర్ణయించింది. వీరితో పాటు ముంబై రంజీ జట్టు మాజీ కెప్టెన్, దివంగత క్రికెటర్ మాధవ్ మంత్రి పేరుతోనూ ఓ లాంజ్‌ను ఏర్పాటు చేయనుంది. శుక్రవారం జరిగిన ఎంసీఏ వార్షిక సమావేశంలో ఈ మేరకు తీర్మానం చేశారు. దేశవాళీ క్రికెట్‌లో ముంబైకి సుదీర్ఘకాలం ప్రాతినిధ్యం వహించిన సచిన్ టెండూల్కర్, ఇటీవల క్రికెట్‌కు వీడ్కోలు పలికిన అజింక్యా రహానే సేవలను గుర్తిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎంసీఏ వెల్లడించింది. ముంబై క్రికెట్‌కు మాధవ్ మంత్రి చేసిన సేవలను



కూడా పరిగణనలోకి తీసుకుని ఆయన పేరును లాంజ్‌కు పెట్టాలని నిర్ణయించింది. వాంఖడే స్టేడియంలో ఏ లాంజ్‌కు ఏ క్రికెటర్ పేరు పెట్టాలి? వాటిని ఏ విధంగా తీర్చిదిద్దాలన్న అంశాలపై నిర్ణయం తీసుకునే బాధ్యతను ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీకి, ఎంసీఏ కార్యదర్శులకు అప్పగించినట్లు సంఘం అధ్యక్షుడు అజింక్యా నాయక్ తెలిపారు. ఈ కమిటీలో ఎంసీఏ ఉపాధ్యక్షుడు జితేంద్ర అవ్హాద్, అపెక్స్ కౌన్సిల్ సభ్యుడు మిలింద్ నర్వేకర్, సలహాదారుడు ఉజ్వల్ నికమ్ ఉన్నారు. ఇదే వార్షిక సమావేశంలో అనుబంధ క్రికెట్ క్లబ్‌లకు రిజర్వ్ మొత్తంగా రూ.100 కోట్లు కేటాయించాలని కూడా ఎంసీఏ నిర్ణయించింది. దిగ్గజ క్రికెటర్ల సేవలను చిరస్థాయిగా గుర్తుంచుకునేలా వాంఖడేలో వారి పేర్లతో లాంజ్‌ల ఏర్పాటు చేయడం ముంబై క్రికెట్‌లో ప్రత్యేక నిర్ణయంగా నిలవనుంది.

# స్పోర్ట్స్

# టెస్టు క్రికెట్‌లో చరిత్ర సృష్టించిన రూట్..

**గల్లంతైన సచిన్ రికార్డు..!**




సుదీర్ఘ ఫార్మాట్‌లో చెలరేగిపోతున్న ఇంగ్లండ్ కెప్టెన్ జో రూట్ చరిత్ర సృష్టించాడు. ఇటీవల కాలంలో పరుగుల వరద పారిస్తున్న రూట్.. రికార్డు అర్ధశతకం సాధించాడు. ఎడ్జ్‌బాస్టన్ టెస్టులో హాఫ్ సెంచరీ బాదిన రూట్ భారత దిగ్గజం సచిన్ టెండూల్కర్ ను దాటేశాడు. రెడ్ బాల్ క్రికెట్‌లో అత్యధిక అర్ధశతకాలు బాదిన ఆటగాడిగా అవతరించాడీ రన్ మెషీన్.టెస్టు క్రికెట్‌లో జో రూట్ పరుగుల సునామీ కొనసాగిస్తున్నాడు. రికార్డు శతకాలతో విరుచుకుపడుతున్న అతడు.. ఈసారి అత్యధిక అర్ధ శతకాల రికార్డును పట్టేశాడు. ఎడ్జ్‌బాస్టన్ టెస్టులో సున్నాకే ఓపెనర్లు ఔటైనా.. క్రీజునంటుకున్న రూట్ పాకిస్థాన్ బౌలర్లను విసిగిస్తూ హాఫ్ సెంచరీ కొట్టాడు. కెరీర్లో 69వ టెస్టు ఫిఫ్టీతో అతడు సచిన్ టెండూల్కర్ రికార్డును బద్ధలు కొట్టాడు. ఎడ్జ్‌బాస్టన్ టెస్టుకు ముందు 68 టెస్టు ఫిఫ్టతో సచిన్ సరసన నిలిచిన అతడు.. యాభై రన్స్‌తో అగ్రస్థానానికి దూసుకెళ్లాడు.

**టెస్టుల్లో అత్యధిక ఫిఫ్టీలు..**

1. జో రూట్ (ఇంగ్లండ్)- 69
2. సచిన్ టెండూల్కర్(భారత్)- 68
3. శివ్‌నారాయణ్ చందర్‌పాల్(వెస్టిండీస్) -- 66
4. అలెన్ బోర్డర్(ఆస్ట్రేలియా) -- 63
5. రాహుల్ ద్రావిడ్(భారత్) -- 63
6. రికీ పాంటింగ్(ఆస్ట్రేలియా) -- 62

# సంక్రాంతి బరిలో చిరంజీవి 'విశ్వంభర'..

## 'కాకా'కు గండం, మెగా ఫ్యాన్స్‌లో పెరుగుతున్న టెన్షన్!




మెగాస్టార్ చిరంజీవి అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న భారీ చిత్రం 'విశ్వంభర' విషయంలో మరోసారి ఆసక్తికరమైన వార్తలు వినిపిస్తున్నాయి. ఎన్నో రోజులుగా వాయిదాల మీద వాయిదాలు పడుతూ వస్తున్న ఈ సినిమా ఎప్పుడు ప్రేక్షకుల ముందుకు వస్తుందనే దానిపై ఇప్పటివరకు పూర్తిస్థాయి స్పష్టత లేకుండా పోయింది. ముఖ్యంగా భారీ స్థాయిలో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి సంబంధించిన విజువల్ ఎఫెక్ట్స్ పనులు ఆలస్యం కావడంతో విడుదల తేదీ పలుమార్లు మారినట్లు వార్తలు వచ్చాయి.అయితే తాజాగా వినిపిస్తున్న సమాచారం ప్రకారం.. 'విశ్వంభర'ను వచ్చే సంక్రాంతి బరిలో దించేందుకు చిత్రబృందం ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. సంక్రాంతి విడుదలపై ప్రస్తుతం చర్చలు జరుగుతున్నాయని, అదే సమయంలో సినిమాకు సంబంధించిన ఓటీటీ ఒప్పందం కూడా తుది దశకు చేరుకున్నట్లు ఇండస్ట్రీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.చిరంజీవి, దర్శకుడు వశిష్ఠ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'విశ్వంభర'పై మొదటి నుంచీ భారీ అంచనాలు ఉన్నాయి. సోషియో ఫాంటసీ నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ సినిమాను భారీ బడ్జెట్‌తో రూపొందిస్తున్నారు. చిరంజీవిని ఇంతకుముందెన్నడూ చూడని తరహాలో చూపించేందుకు దర్శకుడు వశిష్ఠ ప్రయత్నిస్తున్నట్లు చిత్రబృందం ఇప్పటికే పలు సందర్భాల్లో వెల్లడించింది. అయితే సినిమాలో కీలకంగా ఉండే విజువల్ ఎఫెక్ట్స్ పనులకు ఎక్కువ సమయం పడుతుండటంతో విడుదల ఆలస్యం అవుతూ వచ్చింది. ఇప్పుడు ఆ పనులు చివరి దశకు చేరుకున్నాయనే ప్రచారం నేపథ్యంలో.. సంక్రాంతి 2026 విడుదలను లక్ష్యంగా పెట్టుకున్నారనే వార్తలు మరోసారి తెరపైకి వచ్చాయి. 'విశ్వంభర'కు సంబంధించిన ఓటీటీ ఒప్పందం కూడా తుది దశలో ఉందనే వార్తలు వినిపిస్తున్నాయి. సాధారణంగా భారీ చిత్రాల ఓటీటీ హక్కుల విషయంలో విడుదల తేదీకి ముందే కీలక ఒప్పందాలు పూర్తవుతుంటాయి. ఇప్పుడు 'విశ్వంభర' విషయంలోనూ ఇదే తరహాలో చర్చలు జరుగుతున్నట్లు తెలుస్తోంది.అయితే ఓటీటీ భాగస్వామి, ఒప్పంద విలువ వంటి వివరాలపై అధికారిక సమాచారం మాత్రం ఇంకా బయటకు రాలేదు. కాబట్టి ప్రస్తుతం వస్తున్న వార్తలను అధికారిక ప్రకటన వచ్చే వరకు ప్రచారంగానే చూడాల్సి ఉంటుంది.కాగా, ఇప్పటికే సంక్రాంతి సందర్భంగా 'కాకా'ను ప్రకటించిన సంగతి తెలిసిందే. ఒకవేళ 'విశ్వంభర' కూడా సంక్రాంతి బరిలోకి వస్తే.. రెండు మెగా చిత్రాలను ఒకేసారి ప్రేక్షకుల ముందుకు తీసుకురావడం సాధ్యమవుతుందా? అనే ప్రశ్న తలెత్తుతోంది. లేదంటే 'కాకా'ను పండుగ రేసు నుంచి తప్పించే అవకాశం ఉందనే ప్రచారం జరుగుతోంది.



క్యూట్‌స్మైల్.. అదిరిపోయే పోజులు.

# ఆసక్తికరంగా ప్రశాంత్ నీల్ కొత్త సినిమా ట్రైలర్

## రూమ్ నంబర్ '418' భయపెట్టేందుకు వచ్చేస్తోంది..




'కేజీఎఫ్', 'సలార్' వంటి భారీ యాక్షన్ చిత్రాలతో సంచలనాలు సృష్టించిన ప్రముఖ దర్శకుడు ప్రశాంత్ నీల్ సమర్పిస్తున్న లేటెస్ట్ హారర్ థ్రిల్లర్ '418' (ది లాస్ట్ వార్నింగ్) సినిమా ట్రైలర్ తాజాగా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. టాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రంతో తొలిసారిగా హారర్ జోనర్‌లోకి అడుగుపెడుతుండటంతో సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. కీర్తన్ నడగౌడ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రానికి సంబంధించిన ట్రైలర్ సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. 15 ఏళ్లుగా మూతపడిన ఒక రహస్య భవనం మరియు దాని వెనుక ఉన్న 'రూమ్ నంబర్ 418' చుట్టూ ఈ సినిమా కథ తిరుగుతుందని ట్రైలర్ స్పష్టం చేస్తోంది. ఏమాత్రం హాస్యానికి తావు లేకుండా, పూర్తిగా భయం, ఉత్కంఠ మరియు సైకలాజికల్ టెన్షన్ ప్రధానంగా ఈ హారర్ థ్రిల్లర్‌నుఎ తెరకెక్కించినట్లు అర్థమవుతోంది. కంటెంట్ పరంగా తీవ్రత ఎక్కువగా ఉండటంతో సెన్సార్ బోర్డ్ ఈ చిత్రానికి 'ఏ' సర్టిఫికెట్ జారీ చేసింది. ఈ చిత్రంలో సూర్య రాజ్, చరణ్ లక్కరాజు, ప్రీతి పగడాల, చైత్ర ఆచార్ తదితరులు ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, వెంకీ జీజీ సంగీతం అందించారు. దినేష్ దివాకర్ సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వర్తించారు. ప్రేక్షకులకు సరికొత్త భయానక అనుభూతిని పంచడానికి సిద్ధమవుతున్న ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా భారీ థియేటర్లలో సెప్టెంబర్ 18న గ్రాండ్‌గా విడుదల కానుంది.

# వారికోసం సమయాన్ని వృథా చేసుకోలేను



ప్రస్తుతం తల్లి కాబోతున్న అనుభూతిని ఆస్వాదించే పనిలో ఉన్నారు అగ్ర కథానాయిక సమంత రూత్‌ప్రభు. నిరంతరం మీడియా ద్వారానో.. లేక సోషల్ మీడియా ద్వారానో అభిమానులకు చేరువగా ఉండే సామ్.. తాజాగా ఓ ఆంగ్ల మీడియాకు ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ ఇంటర్వ్యూలో కొన్ని ఆసక్తికరమైన విశేషాలను ఆమె పంచుకున్నారు. 'ఆరోగ్య సమస్యలు, వ్యక్తిగత జీవితంలో ఎదురైన ఒడిదుడుకులు అప్పట్లో నన్ను కృంగదీశాయి. అనారోగ్యంతోనే 'సిటాడెల్'లో నటించాను. నేనే కావాలంటూ వారు పట్టుపట్టడం వల్ల చేయక తప్పలేదు. ఒకానొక సమయంలో పూర్తిగా నటనకు స్వస్తి పలకాలని అనుకున్నా. అయితే.. నా జీవనాధారం నటనే. వదిలేస్తే ఆదాయం ఆగిపోతుంది.సంపాదించిన డబ్బు కొన్నాళ్లకు కరిగిపోతుంది. ఏం చేయాలి? అని చాలా ఆలోచించా. దీనికి తగ్గట్టు.. వైద్యులు కూడా మరేదైనా వృత్తి చూసుకోండంటూ సలహా ఇచ్చారు. అందుకే.. ఉన్న డబ్బుతో నమ్మకం ఉన్న వ్యాపారాల్లో పెట్టుబడులు పెట్టాను. వ్యాపారవేత్తగా మారాక, ఆ జీవితాన్ని కూడా బాగానే ఎంజాయ్ చేశాను' అని తెలిపారు సమంత. ఇంకా చెబుతూ "మా ఇంటి బంగారం' సినిమాకు నిర్మాతగా మాత్రమే వ్యవహరించాలనేది నా ఆలోచన. కానీ నేనే చేయాలంటూ రాజ్ బలవంతం పెట్టాడు. తన పోత్సాహం వల్లే 'మా ఇంటి బంగారం'లో నటించాను. ఆ సినిమా మానసికంగా నన్ను బలపరిచింది. ఇప్పుడైతే నాలో చాలా మార్పు వచ్చింది. ఇదివరకు ప్రతిదానికీ ఫీలయ్యేదాన్ని. ఇప్పుడైతే అనవసరపు మాటల్ని పట్టించుకోవడం మానేశా. నా గురించి నెగెటివ్‌గా మాట్లాడాలని ఇతరులు ఫిక్స్ అయ్యాక, వారిని మార్చాలని ప్రయత్నించి నా టైమ్‌ని వృథా చేసుకోలేను. దానికంటే ముఖ్యమైన పనులు నాకు చాలా ఉన్నాయి' అంటూ చెప్పుకొచ్చారు సమంత.

# యూట్యూబ్‌లో దూసుకుపోతున్న 'ఇడుపుకాయితం' ఫస్ట్ సింగిల్!




టాలీవుడ్ టాలెంటెడ్ హీరో ప్రియదర్శి, నాగదుర్గ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా ప్రాజెక్ట్ 'ఇడుపుకాయితం'. సుకుమార్ రైటింగ్స్ మరియు బన్నీ వాస్ వర్క్స్ పతాకాలపై బన్నీ వాస్, తాబితా సుకుమార్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి వంశీ రెడ్డి దొండపాటి దర్శకత్వం వహిస్తున్నారు.తాజాగా ఈ సినిమా నుంచి 'నువ్వు సిన్నబోకే నా శ్రీలత' అంటూ సాగే ఫోక్-మెలోడీ ఫస్ట్ సింగిల్ లిరికల్ సాంగ్‌ను మేకర్స్ విడుదల చేశారు. ప్రముఖ సంగీత దర్శకుడు సురేశ్ బొబ్బిలి అందించిన గ్రామీణ వాతావరణాన్ని తలపించే బాణీలు ఈ పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అలరాజు సాహిత్యానికి శంకర్ బాబు, మోహన భోగరాజు, సీలం పున్నమ్మ, బొల్లెపోగుల సుభద్ర తమ అద్భుతమైన గాత్రంతో ప్రాణం పోశారు. యూట్యూబ్‌లో విడుదలైన అతి తక్కువ సమయంలోనే ఈ లిరికల్ సాంగ్ లక్షలాది వ్యూస్‌తో దూసుకుపోతూ సంగీత ప్రియులను ఎంతగానో ఆకట్టుకుంటూ ట్రెండింగ్‌లో నిలిచింది.

# అందమైన ప్రేమకావ్యం



ఏగన్, శ్రీదేవి, ఫెమినా జార్జ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ప్రేమకథా చిత్రం 'హైకూ'. యువరాజ్ చిన్నసామి దర్శకుడు. విజయ్ సినిమా పతాకంపై డి.అరుళానందు, మాథ్యూ అరుళానందు నిర్మిస్తున్నారు. అక్టోబర్ 23న ప్రేక్షకుల ముందుకురానుంది. ఇటీవల ఈ చిత్ర టీజర్‌ను హరీష్‌కల్యాణ్ లాంచ్ చేశారు. ప్రేక్షకులకు ఓ అందమైన రంగులప్రపంచంలో విహరించిన అనుభూతిని మిగిల్చే చిత్రమిదని, ప్రేమలోని సున్నితమైన భావోద్వేగాల్ని ఆవిష్కరిస్తూ పొయెటిక్ ఫీల్‌తో సాగుతుందని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: ప్రియేష్ గురుస్వామి, సంగీతం: సిద్ధు కుమార్, దర్శకత్వం: యువరాజ్ చిన్నసామి.

Published and Owned By Katta Hima Pavani Published at H.No:4-8-301/34SP, Sathya Nagar Colony, Hayath Nagar, Ranga Reddy, Telangana-501505. Printed at Smilys Online 6-7-48, Vanasthalipuram Shopping Complex, Ranga Reddy District, Telangana-500070, Editor: Katta Hima Pavani, PRGI NO: TGTEL/25/A0471, Phone: 94920 33365